



దేవరాపల్లి ఆర్టీసీ కాంప్లెక్సు ప్రహరీ గోడపై పడిన చెట్టు

నాన్నకు ప్రేమతో...

పిల్లల ఎదుగుదలలో కీలక పాత్ర తండ్రిదే

అయినా వారి ప్రేమను పొందడంలో మాత్రం ఎప్పుడూ వెనుకే..



- తండ్రి త్యాగాన్ని, ప్రేమను గుర్తించి గౌరవించాల్సింది పిల్లలే

నేడు ఫాదర్స్ డే సందర్భంగా ప్రత్యేక కథనం

విశాఖపట్నం/అనకాపల్లి, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): 'అమ్మ తొమ్మిది నెలలు మోస్తే...నాన్న పాతికేళ్లు మోస్తాడు. రెండూ సమానమే... అయినా నాన్న ఎందుకో వెనుకబడ్డాడు. ఇంట్లో జీతం తీసుకోకుండా అమ్మ...తన జీతం అంతా కుటుంబం కోసమే ఖర్చు పెడుతూ నాన్న... ఇద్దరూ సమానమే అయినా నాన్న ఎందుకో వెనుకబడ్డాడు. నాన్న ఇలా వెనుకబడిపోవడానికి కారణం ఆయన అందరికీ వెన్నుముక కావడమే. వెన్నుముక వెనుక ఉండబట్టే దన్నుగా నిలబడగలుగుతున్నాం. ఇదేనేమో నాన్న వెనుకబడిపోవడానికి కారణం'...అంటూ తండ్రి గురించి ఓ ప్రముఖ రచయిత గొప్పగా చెప్పారు. నిజంగానే తండ్రి కష్టాన్ని, ప్రేమను చాలామంది పిల్లలు గుర్తించలేకపోతున్నారు. కుటుంబం కోసం, పిల్లల కోసం నిరంతరం శ్రమించే తండ్రి త్యాగాన్ని గుర్తు చేసుకుంటూ వారి గౌరవార్థం ఏటా జూన్ మూడో ఆదివారం ఫాదర్స్ డేను నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం...

తొలిసారి 1910లో ఫాదర్స్ డేను నిర్వహించారు. అమెరికాకు చెందిన సోనోరా స్మార్ట్ డాడ్ అనే మహిళ తన తండ్రి గౌరవార్థం ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రస్తు తం వందకుపైగా దేశాల్లో ఫాదర్స్ డే వేడుకలను నిర్వహి స్తున్నారు. ఈ ప్రత్యేకమైన రోజున పిల్లలు తమ తండ్రితో ఎక్కువ సమయం గడపడం, విలువైన బహుమతులను అం దించడం ద్వారా వారిని ఆనందంగా ఉంచే ప్రయత్నం చేస్తుంటారు.

తండ్రి త్యాగాన్ని గుర్తించాలి

పిల్లల శ్రేయస్సు కోసం నిరంతరం తండ్రి ఎంతగానో పరితపిస్తుంటాడు.. శ్రమిస్తుంటాడు. పిల్లల ఎదుగుదలలో తండ్రి పాత్ర ఎంతో ఉంటుంది. ఈ విషయాన్ని ప్రతిఒక్కరూ గుర్తుంచుకోవాలి. తండ్రికి గౌరవాన్ని ... మిగతా 2వ పేజీలో

నాన్నే నా మార్గదర్శి



తండ్రి కృష్ణన్‌తో కలెక్టర్ విజయకృష్ణన్

మా నాన్న పి.కృష్ణన్ తమిళనాడులోని ప్రభుత్వ శాఖలో సాధారణ ఉద్యోగి. ఇద్దరు అన్నదమ్ములతో సమానంగా నన్ను నాన్న చూసుకున్నారు. ప్రతీ విషయంలో ప్రోత్సహించారు. నా లక్ష్యం సివిల్ సర్వీసెస్ అని గుర్తించి అండగా నిలిచారు. 2007లో ఐఆర్ఎస్ అధికారిగా సెలెక్ట్ అయ్యాను. నాలుగు పర్యాయాలు ప్రయత్నించిన తరువాత 2013లో సివిల్స్‌కు ఎంపికయ్యాను. నా విజయానికి మార్గదర్శి ఆయనే.

\- కె.విజయకృష్ణన్, కలెక్టర్

నాన్నే నా హీరో



తండ్రి విజయ్‌నందన్ సింహాతో ఎస్పీ తుహిన్ సిన్హా

నా తండ్రి విజయనందన్ సింహా ఉత్తరప్రదేశ్ జీఎస్టీ విభాగంలో జాయింట్ కమిషనర్‌గా సేవలందించారు. నాన్న నేర్పిన అంకితభావం, క్రమశిక్షణ నన్ను ఉన్నతంగా తీర్చిదిద్దాయి. పోలీసు అధికారి కావాలనుకున్న నన్ను వెన్ను తట్టి ప్రోత్సహించారు. సమాజ సేవ చేయాలనే ఉత్తేజాన్ని ఆయన నుంచే నేర్చుకున్నాను. ఆయనే నా రియల్ హీరో

\- తుహిన్ సిన్హా, ఎస్పీ

నీట్‌లో మెరిశారు

ఓపెన్ కేటగిరీలో 59, 64, 70, 116, 238 ర్యాంకులు

- 100 నుంచి 1000 వరకూ మరికొందరికి...
- ఇతర కేటగిరీలలో 17, 45, 172, 232 ర్యాంకులు



డి. సూర్యచరణ్ (59వ ర్యాంకు)



పి.అవినాష్ (64వ ర్యాంకు)



కె.నిధి (116వ ర్యాంకు)



టి.శ్రీనిధి (238వ ర్యాంకు)

విశాఖపట్నం, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): వైద్య కళాశాలల్లో ఎంబీబీఎస్, ఇతర కోర్సుల్లో ప్రవేశాలకు జాతీయ స్థాయిలో నిర్వహించిన 'నీట్'లో విశాఖ విద్యార్థులు సత్తా చాటారు. ఓపెన్ కేటగిరీలో 59, 64, 70, 116, 238, ఇతర కేటగిరీలలో 17, 45, 172, 232 ర్యాంకులు సాధించారు. శనివారం వెల్లడించిన నీట్ ఫలితాల్లో పలువురు 1000లోపు ర్యాంకులు కైవసం చేసుకున్నారు. ఓపెన్ కేటగిరీలో డి.సూర్యచరణ్‌కు 59వ ర్యాంకు, పి.అవినాష్ 64, ఎర్రా సమీర్‌కుమార్ 70, కె.నిధి 116, జి.గురుచరణ్ 207, టి.శ్రీనిధి 238 ... మిగతా 2వ పేజీలో

చిన్నతనం నుంచి డాక్టర్ కావాలని కోరిక

- 59వ ర్యాంకర్ సూర్యచరణ్

పాయకరావుపేట, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): తనకు చిన్నతనం నుంచి డాక్టర్ కావాలనే కోరిక ఉండేదని జాతీయ స్థాయిలో జనరల్ కేటగిరీలో 59వ ర్యాంకు సాధించిన దేశిన సూర్యచరణ్ 'ఆంధ్రజ్యోతి'కి తెలిపాడు. కాకినాడ జిల్లా బెండపూడి గ్రామం తమ స్వస్థలమని, తండ్రి ప్రసాద్ రైతు అని, తల్లి వాణి గృహిణి అని తెలిపాడు. అనకాపల్లి జిల్లా ఎస్.రాయవరం మండలం కొరుప్రోలు గ్రామంలో గల అమ్మమ్మ ఇంట్లో ఉండి ఒకటి నుంచి 4వ తరగతి వరకు గాంధీ మోడల్ స్కూల్లో చదువుకున్నానన్నాడు. అనంతరం తల్లిదండ్రులు పాయకరావుపేట వచ్చేయడంతో 5 నుంచి 10వ తరగతి వరకూ శ్రీప్రకాష్ విద్యాసంస్థల్లో చదువుకున్నానన్నాడు. ఇంటర్ విశాఖపట్నంలోని నారాయణ విద్యా సంస్థల్లో చదివానని, ఢిల్లీ ఎయిమ్స్‌లో ఎంబీబీఎస్‌లో చేరడం తన లక్ష్యమన్నాడు. తదుపరి న్యూరాలజిస్టు కావాలనుందని తెలిపాడు.

భారీ వర్షం

పలు మండలాల్లో సాయంత్రం కుమ్మేసిన వాన



దేవరాపల్లిలో వర్షం

అనకాపల్లి, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు మండలాల్లో శనివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండ కాసింది. ఆ తరువాత వర్షం పడింది. అనకాపల్లి, నర్సీపట్నం, గొలుగొండ, సబ్బవరం, పాయకరావుపేట, ఎలమంచిలిలో చిరుజల్లులు కురిశాయి. ఎస్.రాయవరం, పరవాడ, రాంబిల్లి మండలాల్లో ఒక మోస్తరు వర్షం కురిసింది. చోడవరం, కశింకోట, రావికమతం, బుచ్చెయ్యపేట మండలాల్లో కొద్దిసేపు వర్షం పడింది. మరో రెండు, మూడు రోజులు భారీ వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది.

కె.కోటపాడులో...

కె.కోటపాడు: మండల కేంద్రం కె.కోటపాడు పరిసర ప్రాంతాల్లో శనివారం సాయంత్రం వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతో సుమారు గంట సేపు వర్షం పడింది. ఈ వర్షం కూరగాయల పంటలకు ఊపిరి పోసిందని రైతులు ఆనందం వ్యక్తం చేశారు.

మాడుగులలో..

మాడుగుల రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో శనివారం మెరుపులు, ఉరుములతో వర్షం పడింది. ఉదయం నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు ఎండ కాసింది. తరువాత ఒక్కసారిగా వాతావరణం మారిపోయి మెరుపులు, ఉరుములతో వర్షం పడింది.

కృష్ణాదేవిపేటలో..

కృష్ణాదేవిపేట:గొలుగొండ మండలంలోని పలు గ్రామాల్లో శనివారం వర్షం పడింది. ఏఎల్‌పురం, కొంగశింగి, సీహెచ్ నాగాపురం, పాతకృష్ణాదేవిపేట, లింగంపేట తదితర గ్రామాల్లో ఉదయం నుంచి ముసుగు వాతావరణం నెలకొంది. ఈ వర్షం ఖరీఫ్ సాగుకు ఎంతగానో ఉపయోగపడుతుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

దేవరాపల్లిలో..

దేవరాపల్లి: మండలంలో శనివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఈదురు గాలులతో కూడిన వర్షానికి స్థానిక పోలీస్ స్టేషన్, ఆర్టీసీ కాంప్లెక్సు వద్ద చెట్లు విరిగిపడ్డాయి. ఉదయం నుంచి ఎండ తీవ్రత అధికంగానే ఉంది. సాయంత్రం అయ్యే సరికి వాతావరణం మారిపోయి భారీ వర్షం కురిసింది. స్థానిక జూనియర్ కళాశాల వద్ద విద్యుత్ తీగలపై చెట్టు కొమ్మలు పడడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది.

అన్నదాత ఆనందం

మండలంలో రూ.2 కోట్లతో 75 సాగునీటి కాలువల్లో పూడికతీత, అభివృద్ధి పనులు

- గత వైసీపీ ప్రభుత్వంలో పూర్తిగా నిర్లక్ష్యం
- కాలువలు పూడుకుపోయినా పట్టించుకోని వైనం
- కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రత్యేక దృష్టి
- ఈ ఖరీఫ్‌కు సాగునీటికి ఇబ్బందులు ఉండవని రైతుల హర్షం



మామిడిపాలెం రిజర్వాయర్ కాలువను తవ్వుతున్న కూలీలు

మాకవరపాలెం, జూన్ 14(ఆంధ్రజ్యోతి): మండలంలో రూ.2 కోట్లతో 75 సాగునీటి కాలువల్లో పూడికతీత, అభివృద్ధి పనులు చేపట్టడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాటు సాగునీటి కాలువలను నిర్లక్ష్యం చేయడంతో రైతులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత సాగునీటి కాలువలపై ప్రత్యేక దృష్టి పెట్టి పనులు చేపట్టడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గత ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల మామిడిపాలెం, పాపయ్యపాలెం, బూరుగుపాలెం, మాకవరపాలెం, గిడుతూరు, మల్లవరం సాగునీటి కాలువలు పూర్తిగా పూడుకు పోయాయి. దీని వల్ల వరి సాగుకు రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ... మిగతా 2వ పేజీలో

నిబంధనలు పాటించకే ప్రమాదం

తప్పు ఉద్యోగులదేనట

- ఏపీపీసీబీ చైర్మన్‌కు సాయి శ్రేయాస్ యాజమాన్యం వివరణ
- ఫార్మా సిటీలోని కంపెనీ ప్రతినిధులతో అధికారుల సమావేశం
- ప్రతి ఒక్కరూ భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశాలు
- సిబ్బంది భద్రత పూర్తిగా యాజమాన్యమే తీసుకోవాలని సూచన



వివిధ శాఖల అధికారులు, ఫార్మా కంపెనీల యాజమాన్యాలతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న ఏపీపీసీబీ చైర్మన్ కృష్ణయ్య, సమావేశానికి హాజరైన అధికారులు

విశాఖపట్నం/పరవాడ, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): సాయి శ్రేయాస్ ఫార్మా కంపెనీ యాజమాన్యం తప్పును సిబ్బంది పైకి నెట్టేసింది. రెండు రోజుల క్రితం అక్కడ విష వాయువులు విడుదలై ఇద్దరు సేఫ్టీ అధికారులు మరణించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఏపీ కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్ కృష్ణయ్య శనివారం ఆ కంపెనీని సందర్శించారు. ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆ కంపెనీ ప్రతినిధులు మాట్లాడుతూ, స్టాండర్డ్ ఆపరేషన్ ప్రొసీజర్ (ఎస్ఓపీ)ను ఉద్యోగులు పాటించలేదని, మాస్కులు ధరించలేదని అందుకే వారు చనిపోయారని వివరించారు. తప్పును చనిపోయిన వారిపైకి నెట్టడాన్ని ప్రభుత్వ శాఖల అధికారులు ఎవరూ ఖండించకపోవడం గమనార్హం. సేఫ్టీ విభాగం అసిస్టెంట్ మేనేజర్ చంద్రశేఖర్‌కు ఆ సమయంలో డ్యూటీ లేకపోయినా ఇంటి నుంచి పిలిపించి వ్యర్థాలను శుద్ధి చేసే పని అప్పగించారు. ఇలా ఎందుకు చేయాల్సి వచ్చిందో యాజమాన్యం వివరించలేదు.

ఇక సాయి శ్రేయాస్ కంపెనీ నుంచి తరచూ విషవాయువులు వెలువడుతున్నాయి. ఎదురుగా ఉన్న విమల ఫార్మా కంపెనీ ప్రతినిధులు ఇదే విషయమై సాయి శ్రేయాస్ యాజమాన్యంతో తరచూ గొడవ పడుతున్నారు. విష వాయువుల వల్ల తాము ఇబ్బంది పడుతున్నామని, వాటిని నిరోధించాలని డిమాండ్ చేస్తున్నారు. తనిఖీలకు వెళ్లిన అధికారులు ఇవేవీ ప్రశ్నించకపోవడం గమనార్హం.



ఫార్మా పరిశ్రమలను పరిశీలిస్తున్న దృశ్యం

ఫార్మా ప్రతినిధులతో సమావేశం

ప్రమాద స్థలం పరిశీలన పూర్తయిన తరువాత ఏపీపీసీబీ చైర్మన్ కృష్ణయ్య రాంకీ ఫార్మా సిటీలో కంపెనీల ప్రతినిధులు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఫార్మా కంపెనీలలో వరుస ప్రమాదాలు జరుగుతున్నాయని, చాలామంది మరణిస్తున్నారని, వీటిని నిరోధించడానికి భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇచ్చి తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రతి కంపెనీ తరచూ సేఫ్టీ ఆడిట్, మాక్ డ్రిల్ నిర్వహించాలన్నారు. ఉద్యోగులకు భద్రత నియమాలు, ప్రాసెసింగ్ దశలో వ్యవహరించే తీరుపై నిరంతర శిక్షణ ఇవ్వాలన్నారు. అధికారులు, సిబ్బంది తప్పనిసరిగా పర్సనల్ ప్రొటెక్టివ్ కిట్లు ధరించేలా చూడాలన్నారు. సిబ్బంది భద్రత ... మిగతా 2వ పేజీలో



సబ్బవరం మండలం నంగినారపాడు గ్రామంలో రైతులకు ఈకేవైసీ చేస్తున్న సిబ్బంది

అన్నదాత సుఖీభవ లబ్ధిదారుల జాబితాపై కసరత్తు

- ఈకేవైసీ నమోదు చేస్తున్న వ్యవసాయ సిబ్బంది

(అనకాపల్లి- ఆంధ్రజ్యోతి)

అన్నదాత సుఖీభవ లబ్ధిదారుల తుది జాబితా తయారీపై అధికారులు కసరత్తు చేస్తున్నారు. జిల్లాలో 2,33,570 మంది రైతులు ఈ పథకానికి అర్హులుగా గుర్తించారు. ఈ నేపథ్యంలో వ్యవసాయ శాఖ సిబ్బంది రైతులకు ఈకేవైసీ ప్రక్రియ చేపడుతున్నారు. జిల్లాలో రెండు రోజుల్లో 8,893 మంది రైతుల ఈకేవైసీ పూర్తి చేశారు. ఈ నెల 18వ తేదీ లోగా ఈ ప్రక్రియ ముగించి అర్హుల తుది జాబితా తయారు చేసి ప్రభుత్వానికి జిల్లా వ్యవసాయాధికారులు నివేదించనున్నారు. లబ్ధిదారులకు ఏడాదిలో మూడు విడతల్లో రూ.20 వేలు ఇవ్వనున్నారు. ఈ నెల 20న తొలి విడత రైతుల బ్యాంకు ఖాతాల్లో రూ.7 వేలు జమ చేయనున్నారు.



సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్, హోం మంత్రి అనిత చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న దృశ్యం

తల్లికి వందనం లబ్ధిదారుల ఆనందోత్సాహం

కోటవురట్ల మండలం కైలాసపట్నం గ్రామంలో తల్లికి వందనం పథకం లబ్ధిదారులు శనివారం సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, హోం మంత్రి అనిత చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉంటే అందరికీ పథకం వర్తించడంతో ఆనందం వ్యక్తం చేశారు.

\- కోటవురట్ల/ఆంధ్రజ్యోతి

సీఎం రాక రేపు

బీచ్‌రోడ్డులో యోగా దినోత్సవ ఏర్పాట్ల పరిశీలన

- అనంతరం అధికారులతో సమీక్ష
- మధ్యాహ్నం పీఎం పాలెం వైజాగ్ కన్వెన్షన్ సెంటర్‌లో కార్యకర్తల సమావేశం



విశాఖపట్నం, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈనెల 16వ తేదీన విశాఖ పర్యటనకు రానున్నారు. ఉదయం 10 గంటలకు గన్నవరం ఎయిర్‌పోర్టు నుంచి బయలుదేరి 10.40 గంటలకు విశాఖ చేరుకుంటారు. పది నిమిషాలు ఎయిర్‌పోర్టులో గడిపిన తరువాత 10.50 గంటలకు బయలుదేరి ఆర్కే బీచ్‌రోడ్డులోని కాళీమాత గుడి వద్దకు చేరుకుంటారు. అక్కడ నుంచి పార్కు హోటల్ వరకూ అంతర్జాతీయ యోగా దినోత్సవం ఏర్పాట్లు పరిశీలిస్తారు. అనంతరం 11.45 గంటలకు బయలుదేరి ఏయూ ఇంజనీరింగ్ ... మిగతా 2వ పేజీలో

హామీల అమలు కూటమికే సాధ్యం

▸ సీఎం సహాయ నిధి, బీమా చెక్కుల పంపిణీలో 'ప్రగడ'



సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీలో ప్రగడ, చలపతిరావు

ఎలమంచిలి, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో కూటమి ప్రభుత్వం ముందు వరుసలో ఉంటుందని రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు అన్నారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో శనివారం ముఖ్యమంత్రి సహాయ నిధి, బీమా చెక్కుల పంపిణీలో మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్‌లు ప్రజారంజక పరిపాలన సాగిస్తున్నారన్నారు. తల్లికి వందనం పథకంలో భాగంగా ఇంట్లో చదువుకున్న పిల్లలు ఎంతమంది ఉంటే అందరికీ ఈ పథకం వర్తిస్తుందన్నారు. మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలును ప్రణాళికాబద్ధంగా నిర్వహిస్తున్నారన్నారు. అంతకుముందు ఇటీవల విమాన ప్రమాదంలో మృతి చెందిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆడారి మంజు, ఇత్తంశెట్టి సన్యాసినాయుడు, రాజాన సూర్య నాగేశ్వరరావు, గొర్లె నానాజీ, ఆడారి ఆదిమూర్తి, పీలా తులసీరామ్, ఇత్తంశెట్టి రాజు, పొనమల్ల కొండబాబు, హరీష్, లాలం తాతబాబు, నీరుకొండ నరసింగ రావు, బొద్దపు రమణ, కరణం రవి, పందూరి శ్రీను, దంట్ల వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో పలువురికి స్వల్ప గాయాలు

మునగపాక, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి- అచ్యుతాపురం మార్గం పూడిమడకలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. అచ్యుతాపురం నుంచి అనకాపల్లి వైపు వెళ్తున్న ఆటోను అనకాపల్లి నుంచి మునగపాక వైపు వస్తున్న కారు ఢీ కొట్టింది. ఈ సంఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న డ్రైవర్ ఎస్.గోవిందతో పాటు ముగ్గురికి స్వల్ప గాయాలు అయ్యాయి.

నేడు పద్మశాలీల కుల, జనగణన



సమావేశంలో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న పద్మశాలీ నేతలు

అచ్యుతాపురం, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : పద్మశాలీల కుల, జనగణన ఆదివారం విశాఖపట్నంలో జరుగుతుందని సామాజిక సభ్యులంతా హాజరవాలని ఆంధ్రప్రదేశ్ పద్మశాలీ సంఘం కన్వీనర్ పప్పు రాజారావు పిలుపునిచ్చారు. ఇక్కడి భద్రావతి చేనేత సహకార సంఘంలో శనివారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. విశాఖలోని శంకరమఠం ఎదురుగా ఉన్న పద్మశాలీ భవనంలో కుల, జనగణన మొబైల్ యాప్, రిజిస్ట్రేషన్ లాంచ్ చేస్తున్నామన్నారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు మాడెం సూరి అప్పారావు, సూరిశెట్టి రుషిబాబు, వానపల్లి జగ్గారావు, రమణమ్మ, దుబా రాజు, ఎ.అప్పలరాజు, మాడెం అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



ఎలమంచిలి మెప్మా కార్యాలయం ఆవరణలో యోగాసనాలు



మునగపాక మండలం గణపర్తిలో...

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

▸ 'యోగాంధ్ర'లో వక్తలు ▸ పలు గ్రామాల్లో ఆసనాలు వేసి, అవగాహన ర్యాలీలు



అచ్యుతాపురంలో యోగా చేస్తున్న రెవెన్యూ సిబ్బంది



రాంబిల్లి ఎంపీడీవో కార్యాలయంలో...

ఎలమంచిలి, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : నిత్య జీవితంలో యోగా సాధన వల్ల సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా టీచర్ గంగాధర్ అన్నారు. మునిసిపాలిటీలోని మెప్మా కార్యాలయం ఆవరణలో శనివారం మెప్మా ఆర్పీలకు, మహిళలకు యోగాపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మెప్మా సీఎంఎం పద్మావతి మాట్లాడుతూ డ్వాక్రా మహిళలంతా యోగా నేర్చుకోవడంతో పాటు క్రమం తప్పకుండా ఆచరించాలన్నారు. కుటుంబ సభ్యులకు వివరిస్తే ఆస్పత్రులకు వెళ్లాల్సిన పని ఉండదన్నారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్లు ఉమాదేవి, కృష్ణవేణి, వెలుగు సీసీలు పాల్గొన్నారు. అదే విధంగా మునిసిపాలిటీ పరిధి రామారాయుడుపాలెంలో గొర్లె బాబూరావు, బెజవాడ మణిబాబు ఆధ్వర్యంలో సచివాలయ సిబ్బంది యోగాసనాలు వేశారు. సచివాలయ సిబ్బంది రమణబాబు తదితరులు పాల్గొన్నారు.

అచ్యుతాపురం మండలంలో...

అచ్యుతాపురం : యోగా వల్ల ఆరోగ్యకరమైన జీవితాన్ని పొందవచ్చని ఇన్‌చార్జి తహసీల్దార్ శ్యామ్ కుమార్ అన్నారు. శనివారం ఇక్కడ రెవెన్యూ సిబ్బంది యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పని ఒత్తిడి ఎంత ఉన్నా ప్రతి రోజూ అరగంట సేపు యోగాచేస్తే సత్ఫలితం ఉంటుందన్నారు. అనంతరం యోగాసనాలు వేశారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

మునగపాక మండలంలో...

మునగపాక : మండలంలోని పలు గ్రామాల్లో యోగాపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. మునగపాకలోని రాహుల్ గాంధీ కల్యాణ మండపం, గణపర్తి జడ్పీ హైస్కూల్‌లో పిల్లలు, పెద్దలు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది ఆసనాలు వేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఎస్.ఎ.మహేశ్వరరావు, సర్పంచ్ చదరం సూర్యగణేష్‌నాయుడు, మాజీ సర్పంచ్‌లు ఆడారి సాంబమూర్తి, కర్రి రామనాగేశ్వరరావు, మాజీ ఎంపీటీసీ సూరిశెట్టి వెంకటరమణ, కార్యదర్శి షణ్ముకరావు, వీఆర్వో అప్పారావు, యోగా గురువులు పాల్గొన్నారు.

రాంబిల్లి మండలంలో...

రాంబిల్లి: సంపూర్ణ ఆరోగ్యం కోసం ప్రతి ఒక్కరూ యోగాసనాలు చేయాలని రాంబిల్లి ఎంపీడీవో జయమాధవి, తహసీల్దార్ శ్రీనివాసరావు అన్నారు. ఎంపీడీవో కార్యాలయంతో పాటు పలు గ్రామాల్లోని సచివాలయాల్లో శనివారం యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీడీవో కార్యాలయంలో వీరు మాట్లాడుతూ యోగాపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. శారీరక ఆరోగ్యానికి యోగా దివ్య ఔషధంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ రాజు, టీడీపీ మండల నాయకులు, వి.దిన్‌బాబు, జనసేన మండల శాఖ అధ్యక్షుడు పి.నూకన్నదొర, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మలేరియాపై అవగాహన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

రాంబిల్లి, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) :మలేరియా మాసోత్సవాల్లో భాగంగా దిమిలి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మండలంలోని కట్టుబోలు గ్రామంలో సిబ్బంది మలేరియా నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా దిమిలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం విస్తరణాధికారి ఎస్ఎస్‌వీఎస్ రాజు మాట్లాడుతూ ఇళ్ల చుట్టూ నీటి నిల్వలు ఉండడం వలన దోమలు వ్యాప్తి చెంది డెంగ్యూ, ఫైలేరియా, చికన్‌గున్యా తదితర వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందన్నారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌వీ మల్లీశ్వరి, అంగన్‌వాడీ కార్యకర్త సింహాచలం, కామేశ్వరి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

మృతుడు కుమార్‌కు కన్నీటి వీడ్కోలు



కుమార్ అంతిమయాత్రలో పాల్గొన్న యువకులు

మునగపాక, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : పరవాడ ఎస్ఎస్ ఫార్మా కంపెనీలో విధులు నిర్వహిస్తూ గ్యాస్ ప్రమాదానికి గురై మృతి చెందిన శరగడం కుమార్ అంత్యక్రియలు స్వగ్రామం మునగపాకలో శనివారం జరిగాయి. ఈ నెల 11వ తేదీ రాత్రి కంపెనీలో జరిగిన ప్రమాదంలో కుమార్ మృతి చెందిన విషయం తెలిసిందే. ఆ కుటుంబంలో భార్య తరువాత మిగిలి ఉన్న తమ్ముడు విదేశాల్లో ఉం డడంతో ఈ నెల 12న జరగాల్సిన అంత్యక్రియలను వాయిదా వేశారు. తమ్ముడు వంశీ రావడంతో శనివారం సాయంత్రం పూర్తి చేశారు. విశాఖ నుంచి అంబులెన్స్‌లో కుమార్ మృతదేహాన్ని మునగపాక తీసుకువచ్చారు. అనకాపల్లి బైపాస్ నుంచి శ్మశానవాటిక వరకు అంతిమయాత్ర నిర్వహించారు. అంత్యక్రియల్లో యువకులు, గ్రామపెద్దలు, కుటుంబీకులు అధిక సంఖ్యలో పాల్గొని కన్నీటి వీడ్కోలు పలికారు.

అందలాపల్లిలో 25 మంది రక్తదానం

అచ్యుతాపురం రూరల్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ రక్తదాన దినోత్సవం సందర్భంగా సత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో శనివారం మండలంలోని హరిపాలెం శివారు అందలాపల్లిలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. అనకాపల్లి ఎన్టీఆర్ బ్లడ్ బ్యాంక్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో 25 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. గ్రామానికి చెందిన కాండ్రేగుల వెంకట అప్పారావు 29వ సారి రక్తదానం చేయడం విశేషం. ఈ కార్యక్రమంలో శిబిరం నిర్వాహకులు కర్రి ఆది నాగేశ్వరరావు, అనకాపల్లి సత్యసాయి సేవా సంస్థల అధ్యక్షుడు కశిరెడ్డి అప్పలనాయుడు, ప్రతినిధులు రామారావు, పీఎస్‌టీ పట్నాయిక్, మారిశెట్టి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆంజనేయ ఆలయ వార్షికోత్సవం



మునగపాక, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : గణపర్తి గ్రామంలోని దళిత కాలనీలో గల ఆంజనేయ ఆలయం 35వ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువ జాము నుంచి స్వామివారికి విశేష పూజలు జరిపారు. పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. కమిటీ సభ్యులు గిన్నె వీరమహేశ్వరరావు, యల్లపు అప్పారావు, అర్చకులు శ్రీనివాసరావు, పి.శ్రీను, బి.కృష్ణ, చదరం జగది, పెంటకోట నాయుడు తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వరుణ్ మోటార్స్ బ్రాంచి మేనేజర్, క్యాషియర్ అరెస్టు

గాజువాక, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): వరుణ్ మోటార్స్ సంస్థలో పని చేస్తూ సంస్థకు చెందిన పాత ద్విచక్ర వాహనాల విక్రయాల్లో అక్రమ లావాదేవీలకు పాల్పడిన చోడవరం బ్రాంచి మేనేజర్ సేనాపతి రవికృష్ణ, క్యాషియర్ విస్సారపు కొండారావులను శనివారం గాజువాక పోలీసులు అరెస్టు చేశారు. సీఐ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రవికృష్ణ చోడవరం బ్రాంచి మేనేజర్‌గా పనిచేసినప్పుడు 2020 నుంచి 2025 మధ్య కాలంలో సుమారు 400 పాత ద్విచక్ర వాహనాలకు సంబంధించి డెలివరీ రశీదులను ఫోర్జరీ చేసి విక్రయించి అక్రమ లావాదేవీలకు పాల్పడినట్టు పోలీసుల విచారణలో వెల్లడించాడు. ఇందులో కొండారావు కూడా కీలకంగా వ్యవహరించినట్టు తేలింది. కాగా ఉమ్మడి విశాఖ జిల్లా వ్యాప్తంగా ఉన్న వరుణ్ బజాజ్ బ్రాంచిలలో ఆర్థిక మోసాలు జరిగినట్టు వరుణ్ సంస్థ ప్రతినిధులు గతంలో గాజువాక పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు కేసు నమోదు చేసి అప్పట్లో కొంతమందిని అరెస్టు చేయగా, తాజాగా పరారీలో ఉన్న ఇద్దరు నిందితులనుగాజువాక ప్రాంతంలోసీఐ పార్థసారథి అరెస్టు చేశారు.

స్థానిక సంస్థల ఎన్నికల టీడీపీ పరిశీలకునిగా చిట్టిబాబు



యనమల రామకృష్ణుడిని కలిసిన పెదిరెడ్డి చిట్టిబాబు తదితరులు

పాయకరావుపేట, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు తుని నియోజకవర్గ స్థానిక సంస్థల ఎన్నికల టీడీపీ పరిశీలకునిగా నియమితులయ్యారు. శనివారం పార్టీ అధిష్ఠానం నుంచి ఆదేశాలు జారీకావడంతో ఆయన తునిలో మాజీ మంత్రి, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు యనమల రామకృష్ణుడిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తుని నియోజకవర్గంలో త్వరలో జరుగనున్న స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి ఇప్పటి నుంచి పార్టీపరంగా చేపట్టాల్సిన పలు అంశాలపై ఇద్దరూ చర్చించుకున్నారు. యనమలను కలిసినవారిలో టీడీపీ నాయకులు చింతకాయల రాంబాబు, కట్టా శ్రీను, వేములపడి అప్పారావు, దువ్వి శ్రీను తదితరులున్నారు.

'ప్రధాని నరేంద్రమోదీ పాలనలో దేశాభివృద్ధి'



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షులు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు

పాయకరావుపేట, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్రమోదీ సారథ్యంలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని బీజేపీ జిల్లా అధ్యక్షులు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు అన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 11 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా శనివారం పాయకరావుపేట అసెంబ్లీ కన్వీనర్ శ్రీరంగం రమేశ్ ఆధ్వర్యంలో వికసిత భారత్ సంకల్ప సభ జరిగింది. ఈ సందర్భంగా పరమేశ్వరరావు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వ హయాంలో దేశం ఆర్థికంగా, పారి శ్రామికంగా బలోపేతంతోపాటు సంక్షేమ పథకాల అమలుతో అన్ని వర్గాలకు ఎంతో మేలు జరుగుతోందన్నారు. ఈ పథకాలు ప్రజల్లోకి తీసుకువెళ్లి గ్రామస్థాయిలో పార్టీని బలోపేతం చేయాలని పార్టీ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు. వికసిత భారత్ సంకల్ప ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ వీవీఎస్ వర్మ, రాష్ట్ర కిసాన్‌మోర్చా ప్రధాన కార్యదర్శి రవిరాజు, కో-కన్వీనర్ రత్నభరత్, మండల అధ్యక్షులు మంచాల గాంధీ, పట్టణ అధ్యక్షులు కువల కుమార్ నాయకులు కోనే రంగయ్యస్వామి, కలిగట్ల మూలాస్వామి, దాడి శ్రీను, ఏసురత్నం, నాగభూషణం పాల్గొన్నారు.

'పేట'లో భారీ వర్షం



కురుస్తున్న వర్షం

పాయకరావుపేట, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): పాయకరావుపేటలో శనివారం భారీ వర్షం పడింది. ఉదయం అధిక ఉష్ణోగ్రతలు నమోదవగా సాయంత్రం ఒక్కసారిగా ఆకాశం మేఘాలు కమ్మి పావుగంటపాటు భారీ వర్షం పడింది. ఆ తరువాత మళ్లీ రాత్రి 7 నుంచి భారీ వర్షం పడింది. దీంతో పట్టణంలో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. మెయిన్‌రోడ్డులో పలు చోట్ల వర్షపునీరు నిలిచి ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో పట్టణం అంధకారంగా మారింది.

ఒకే కుటుంబంలో నలుగురికి 'తల్లికి వందనం'

▸ నిరుపేద దంపతుల ఆనందం



తల్లికి వందనం పొందిన నలుగురు పిల్లలతో కృతజ్ఞతలు తెలుపుతున్న అప్పలనర్స

నక్కపల్లి, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉపమాక గ్రామంలోని ఓ కుటుంబంలో నలుగురు పిల్లలకు తల్లికి వందనం పథకం కింద డబ్బులు జమయ్యాయి. ఒక్కొక్కరికి రూ.13 వేల చొప్పున రూ.52 వేలు వారి బ్యాంకు ఖాతాలో పడ్డాయి. దీంతో నిరుపేద దంపతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఉపమాక గ్రామానికి చెందిన రంగాల లోవయ్య, అప్పలనర్స దంపతులకు నలుగురు పిల్లలు ఉన్నారు. రంగాల లోవయ్య కూలి పనిచేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. పిల్లల్లో పెద్ద కుమారుడు రంగా ప్రవీణ్ ఎనిమిదో తరగతి, కవలలు రామ, లక్ష్మణ్ ఏడో తరగతి, కుమార్తె పవిత్ర ఐదో తరగతి చదువుతున్నారు. తల్లికి వందనం పథకం కింద నలుగురు పిల్లలకూ ఒక్కొక్కరికి రూ.13 వేల చొప్పున రూ.52 వేలు తల్లి ఖాతాలో పడ్డాయి. దీంతో ఆ పేద కుటుంబంలో ఆనందం వెల్లివిరుస్తోంది.

చంద్రబాబుకు రుణపడి ఉంటాం

మా నలుగురి పిల్లలకు తల్లికి వందనం పథకం ద్వారా లబ్ధి చేకూరడం ఆనందం కలుగుతోంది. ఇచ్చిన మాట నిలబెట్టుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు రుణపడి వుంటాం. మా పేద కుటుంబాల్లో పిల్లలను ఆదుకోవడానికి ఈ బృహత్తర పథకానికి శ్రీకారం చుట్టిన ముఖ్యమంత్రికి ప్రత్యేక కృతజ్ఞతలు. తల్లికి వందనం ద్వారా వచ్చిన సొమ్మును మా సొంత అవసరాలకు కాకుండా పిల్లల కోసమే వినియోగిస్తాం.

- రంగాల అప్పలనర్స, ఉపమాక



మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి: ఎస్ఐ



పోస్టర్ విడుదల చేస్తున్న ఎస్ఐ పురుషోత్తం, ఉపాధ్యాయులు

పాయకరావుపేట రూరల్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): ,విద్యార్థులు, యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని స్థానిక ఎస్ఐ పురుషోత్తం అన్నారు. మండలంలోని పి.ఎల్.పురం సమీపంలోని తిరుమల విద్యా సంస్థలో శనివారం నాశ ముక్తి భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కువగా యువతే మాదక ద్రవ్యాలకు బానిసలవుతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయన్నారు. విద్యార్థులు డ్రగ్స్ భూతం జోలికి వెళ్లొద్దన్నారు. మాదక ద్రవ్యాల వలన కుటుంబాలు రోడ్డున పడతాయన్నారు. ఈ కార్యక్రమంలో తిరుమల విద్యాసంస్థల ఉపాధ్యాయులు, విద్యార్థులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నేటి యోగాంధ్ర క్యాంపెయిన్‌కి తప్పక హాజరు కావాలి



పాయకరావుపేటలో యోగాసనాల శిక్షణ తరగతులు

పాయకరావుపేట, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలో యోగా శిక్షణ తరగతులకు హాజరైనవారంతా ఆదివారం ఎస్. రాయవరం మండలంలో నిర్వహించే యోగాంధ్ర-2025 క్యాంపెయిన్‌కి తప్పనిసరిగా హాజరుకావాలని స్థానిక ఎంపీడీఓ ఎ. జయప్రకాశరావు తెలిపారు. శనివారం స్థానిక పీఆర్ గెస్టు హౌస్ ఆవరణలో పంచాయతీ కార్యదర్శి ఎంవీఎస్. లవరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన యోగాశిక్షణ తరగతులను ఆయన పరిశీలించారు. డిప్యూటీ ఎంపీడీఓ కె.డేవిడ్, ఏఓ వర్మ తదితరులున్నారు.

శ్రీరాంపురంలో యోగాసనాలు

పాయకరావుపేట రూరల్: మండలంలోని శ్రీరాంపురం గ్రామంలో శనివారం ఉదయం సచివాలయం సిబ్బంది యోగాసనాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ తలపాటి వర్మ మాట్లాడారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వై.వి.సత్యనారాయణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నక్కపల్లి: మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీడీవో డీ సీ తారామరాజు ఆధ్వర్యంలో పలువురు ప్రభుత్వశాఖల అధికారులు, ఉద్యోగులతో యోగా గురువు డి.రాంబాబు ఆసనాలు ప్రాక్టీస్ చేయించారు. సీడీపీవో శ్రీవిద్య, సూపర్‌వైజర్లు లలిత, సత్యవతి, ఉపాధి పథకం ఏపీవో భాగ్యవతి, వెలుగు ఏపీఎం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. నక్కపల్లి, డీఎల్‌పురం, ఉపమాక తదితర సచివాలయాల పరిధిలోనూ ఆసనాల డెమో జరిగింది.



కోటవురట్ల: బీకేపల్లిలో ఆసనాలు వేస్తున్న ఉద్యోగులు, చిన్నారులు

కోటవురట్ల: మండలంలోని బీకేపల్లిలో శనివారం మండలస్థాయిఅధికారులు యోగా శిబిరం నిర్వహించారు. స్థానిక తహసీల్దార్ తిరుమలబాబు,ఎంపీడీవో కాశీవిశ్వనాథం, ఈవోపీఆర్‌డి రఘురామ్, వైద్య, వెలుగు, వ్యవసాయ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్. రాయవరం: మండలంలోని ఉప్పరాపల్లి సచివాలయంలో శనివారం సచివాలయ ఉద్యోగులుగా యోగా కార్యక్రమం నిర్వహించారు. ఇందులో టీడీపీ మండల అధ్యక్షుడు అలకంటి అబద్ధం ముఖ్య అతిథిగా పాల్గొని యోగాసనాలు వేసారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకుడు ముప్పిన శ్రీనివాసరావు తదితరులున్నారు.

నాన్నకు ప్రేమతో...

... 1వ పేజీ తరువాయి

ఇవ్వడంతో పాటు వారి త్యాగాలను గుర్తించాలి.

ఇలా చేయండి..

ప్రతిరోజూ ఎంతో కొంత సమయం తండ్రితో గడిపేం దుకు యత్నించాలి. దూరంగా ఉంటే వారితో రోజుకు ఒక సారైనా ఫోన్‌లో మాట్లాడాలి. ఆరో గ్యం గురించి వాకబు చేయాలి. హెల్త్ బీమా వంటివి తీసుకుని వారి ఆరోగ్యానికి రక్షణ కవచాన్ని ఏర్పాటుచేయాలి. ఆర్థిక ఇబ్బందులు లేకుండా చూసుకోవాలి. చివరి దశలో కంటికి రెప్పలా చూసుకుంటూ ముందుకుసాగాలి.

అన్నదాత ఆనందం

... 1వ పేజీ తరువాయి

ఉపాధి హామీ పథకం ద్వారా సాగునీటి కాలువల్లో పూడికల తొలగింపు, అభివృద్ధికి చర్యలు చేపట్టింది. మండలంలో సుమారు 75 చిన్న, పెద్ద, రిజర్వాయర్ సాగునీటి కాలువలను అభివృద్ధి చేస్తున్నట్టు మండల ఏపీవో కాశీ తెలిపారు. మామిడిపాలెం రిజర్వాయర్ కింద ఉన్న సుమారు 400 ఎకరాలకు సాగునీరు అందించే సాగునీటి కాలువ పనులు గత 20 రోజులుగా చేస్తున్నారు. ఈ ఏడాది రిజర్వాయర్ నుంచి నీరు వరి సాగుకు అందుతుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అయితే గత ప్రభుత్వం ఈ కాలువను ఐదేళ్లుగా పట్టించుకోకపోవడంతో రైతులు వరిసాగును వదిలేసి సరుగుడు వేశారు. అలాగే మాకవరపాలెం మెరక కాలువ ఐదేళ్లుగా తుప్పలతో ఉండడంతో ఈ కాలువ కింద ఉన్న సుమారు 200 మంది సాగురైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఇప్పుడు ఈ కాలువ పనులు కూడా చేపట్టడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మల్లవరం నుంచి గిడుతూరు గ్రామాల్లో ఉన్న 300 ఎకరాలకు సాగునీరు అందించే సాగునీటి కాలువలో తుప్పలు, పూడికలు తొలగించి సాగునీరు వచ్చేలా అభివృద్ధి చేశారు. మిగతా కాలువల అభివృద్ధి పనులు జోరుగా సాగుతున్నాయి. ఖరీఫ్ నాటికి ఈ పనులు పూర్తయితే ఈ ఏడాది సాగునీటికి ఇబ్బందులు ఉండవని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

నిబంధనలు పాటించకే ప్రమాదం

... 1వ పేజీ తరువాయి

పూర్తిగా యాజమాన్యమే తీసుకోవాలన్నారు. ప్రమాదకరమైన ఉత్పత్తుల తయారీ నైపుణ్యం కలిగిన వారి పర్యవేక్షణలోనే జరగాలన్నారు. భద్రతా ప్రమాణాలు పాటించేందుకు నిరంతరం విజిలెన్స్ విభాగం పనిచేయాలన్నారు. ఈ సమావేశంలో చీఫ్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ ప్రసాదరావు, ఫ్యాక్టరీస్ జాయింట్ చీఫ్ ఇన్‌స్పెక్టర్ శివశంకరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సీఎం రాక రేపు

...1వ పేజీ తరువాయి

కళాశాల మైదానానికి చేరుకుని యోగా దినోత్సవ ఏర్పాట్లు పరిశీలించి, మధ్యాహ్నం 12.05 గంటలకు నోవాటెల్ హోటల్‌కు వెళతారు. 12.15 నుంచి 1.30 గంటల వరకు యోగా దినోత్సవంపై అధికారులతో సమీక్షిస్తారు. మధ్యాహ్నం 2.30 గంటలకు నోవాటెల్ హోటల్‌లో బయలుదేరి 2.50 గంటలకు పీఎం పాలెంలోని వైజాగ్ కన్వెన్షన్ సెంటర్‌కు వెళ్లి పార్టీ కార్యకర్తల సమావేశంలో పాల్గొంటారు. అనంతరం సాయంత్రం ఐదు గంటలకు బయలుదేరి ఎయిర్‌పోర్టుకు చేరుకుని 5.35 గంటలకు ప్రత్యేక విమానంలో విజయవాడ వెళతారు.

నీట్‌లో మెరిశారు

... 1వ పేజీ తరువాయి

డి.జాహ్నవి 358, జామి గిరిజ 425, ఎం.జయదీప్ 672వ ర్యాంకు, జి.లక్ష్మీచరణ్ 875వ ర్యాంకు సాధించారు. వివిధ కేటగిరీల్లో చూస్తే 402, 905, 1582, 1742, 1782, 2190, 2742, 2956 ర్యాంకులు లభించాయి. నగరంలో శ్రీచైతన్య, నారాయణ, శ్రీవిశ్వ, అసెంట్ విద్యార్థులు మంచి ర్యాంకులు సాధించారు. ఓపెన్ కేటగిరీలో 1000లోపు ర్యాంకర్లకు ఎయిమ్స్, ఇతర ప్రముఖ వైద్య కళాశాలల్లో సీట్లు లభించనున్నాయి.

వృత్తి నైపుణ్యంతోనే గుర్తింపు

» నీతి, నైతికత న్యాయవాద వృత్తిలో అవసరం » సీనియర్ల సలహాలు పాటిస్తే సొంతంగానే వృద్ధి

» లీగల్ ఓరియంటేషన్ ప్రోగ్రాం ముగింపోత్సవంలో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చీమలపాటి రవి

సబ్బవరం, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : వృత్తి నైపుణ్యంతోనే న్యాయవాదులు గుర్తింపు పొందగలరని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చీమలపాటి రవి అన్నారు. ఇక్కడి దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయంలో మూడు రోజులుగా ఆంధ్రప్రదేశ్ బార్ కౌన్సిల్, డీఎస్ఎన్ఎల్‌యూ ఆధ్వర్యంలో జరుగుతున్న లీగల్ ఓరియంటేషన్ ప్రోగ్రాం శనివారం ముగిసిన సందర్భంగా ఏర్పాటైన కార్యక్రమంలో జస్టిస్ రవి ముఖ్య అతిథిగా ప్రసంగించారు. న్యాయవాద వృత్తిలో రాణించేందుకు అవసరమైన ముఖ్యమైన లక్షణాలను సమగ్రంగా వివరించారు. నీతి, నైతికత న్యాయవాది వృత్తిలో ఎంతో అవసరమన్నారు. కెరీర్‌పైన దృష్టిపెట్టడం ఎంతో ముఖ్యంగా పేర్కొన్నారు. కొత్తగా వృత్తిలోకి అడుగుపెడుతున్న యువ న్యాయవాదులకు ఓపిక, సహనం ఎంతో అవసరమని సూచించారు. సీనియర్ న్యాయవాదులను తరచూ కలుస్తూ వారి సలహాలు, సూచనలు తీసుకుంటే సొంతంగానే ఎదగవచ్చునన్నారు. అనంతరం వర్సిటీ వీసీ ప్రొఫెసర్ డి.సూర్యప్రకాశ రావు, ఆంధ్రప్రదేశ్ బార్ కౌన్సిల్ చైర్మన్ నల్లారి ద్వారకానాథ్‌రెడ్డి, బార్ కౌన్సిల్ వైస్ చైర్మన్ సిరపురపు కృష్ణమోహన్ ఆయనను ఘనంగా సత్కరించారు. బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఏపీ సభ్యులు అలూరి రామిరెడ్డి, హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షులు కలిగినీడి చిదంబరం, బార్ కౌన్సిల్ విశాఖపట్నం సభ్యులు పి.నరసింగరావు, గంటా రామారావు, కీర్తి రామ జోగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



ముగింపోత్సవంలో జస్టిస్ రవిని సత్కరిస్తున్న వీసీ ప్రొఫెసర్ సూర్యప్రకాశరావు తదితరులు

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

» 13 మంది అరెస్టు

» రూ. 1,02,348 నగదు, నాలుగు మోటారు సైకిళ్లు స్వాధీనం



పోలీసులు అరెస్టు చేసిన పేకాట రాయుళ్లు

కశింకోట, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : పేకాట స్థావరంపై పోలీసులు శనివారం దాడి చేసి భారీగా నగదు, వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించి సీఐ అల్లు స్వామినాయుడు తెలిపిన వివరాలివి. మండలంలోని కచ్చర్లపాలెం గ్రామ శివారులో పెద్ద ఎత్తున పేకాట జరుగుతుందని అందిన సమాచారం మేరకు ఎస్ఐలు మనోజ్‌కుమార్, లక్ష్మణరావు, సిబ్బందితో దాడి చేశారన్నారు. ఈ సందర్భంగా 13 మంది పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకుని, వారి వద్ద ననుంచి రూ.లక్షా రెండు వేల 348 నగదు, నాలుగు మోటారు సైకిళ్ళు, 12 మొబైల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. అనంతరం నిందితులను అరెస్టు చేశామని వివరించారు.

గంజాయితో ఇద్దరి అరెస్టు

అనకాపల్లి టౌన్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): తమిళనాడుకు గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్టు పట్టణ సీఐ టీవీ విజయ్‌కుమార్ తెలిపారు. శనివారం పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తమిళనాడు రాష్ట్రం మధురై మండలం ఉసిలంపట్టి గ్రామానికి చెందిన జయవీరన్ కారుతి వీరదేవర్ డబ్బు సంపాదించాలనే ఆశతో తన స్నేహితుడు జి.మాడుగుల మండలం కోడాపల్లి గ్రామంలోని పీర్ రామన్ ప్రభాహర్ వద్దకు వచ్చి పది కిలోల గంజాయి కొనుగోలు చేశాడు. ప్రభాహర్ మధురైకు చెందిన వీరదేవర్‌ను ద్విచక్ర వాహనంపై అనకాపల్లి రైల్వే స్టేషన్‌లో దింపేందుకు శుక్రవారం మధ్యాహ్నం విశాఖ ఏజెన్సీ నుంచి బయలుదేరాడు. గూడ్స్‌షెడ్ వద్ద ఎస్ఐ, సిబ్బంది వాహనాలు తనిఖీ చేస్తుండగా ఇద్దరు బైక్, బ్యాగ్ వదిలేసి పారిపోయేందుకు ప్రయత్నించారు. ఎస్ఐ, సిబ్బంది వారిని అదుపులోకి తీసుకున్నారు. బ్యాగ్‌ను తనిఖీ చేయగా గంజాయి ఉందని సీఐ తెలిపారు. గంజాయితో పాటు రెండు సెల్‌ఫోన్లు, రూ.2250 నగదు, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. వారిద్దరిపైన కేసు నమోదు చేసి శనివారం కోర్టుకు తరలించామని సీఐ చెప్పారు. ఈ సమావేశంలో ఎస్ఐలు డి.ఈశ్వరరావు, అల్లు వెంకటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

నిత్య జీవితంలో యోగా భాగం కావాలి : కలెక్టర్

అనకాపల్లి కలెక్టరేట్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : నిత్య జీవితంలో యోగాను ప్రతి ఒక్కరూ భాగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ సూచించారు. యోగాంధ్రలో భాగంగా శనివారం కలెక్టరేట్ ఆవరణలో యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు. కలెక్టర్‌తో పాటు వివిధ శాఖల అధికారులు యోగాసనాలు వేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ యోగా ప్రతి రోజూ చేయడం వల్ల మానసిక ప్రశాంతత పొందుతారన్నారు. అలాగే శరీరంలోని రోగ నిరోధకశక్తి వృద్ధి చెందుతుందని చెప్పారు. ఉద్యోగులంతా క్రమం తప్పకుండా ప్రతి రోజూ యోగా చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌వో వై.సత్యనారాయణరావు, యోగా గురువులు ఆర్.శ్రీను, డి.అప్పారావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. దివ్యాంగులు ఽ ఎన్టీఆర్ స్టేడియంలో యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు. యోగా గురువు మంగియ్య వీరితో ఆసనాలు వేయించిన అనంతరం ర్యాలీ జరిపారు. విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయో వృద్ధుల సంక్షేమ శాఖ సూపరింటెండెంట్ జి.అన్నపూర్ణ, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ సంఘం వ్యవస్థాపకులు పాత్రపల్లి వీరుయాదవ్, వెంకటేశ్వరరావు, వేదుల చంద్రశేఖర్, ఆడారి సంతోష్ అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

తుమ్మపాల : నిత్యం యోగా సాధనతో సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చునని ఎంపీడీవో ఆశాజ్యోతి అన్నారు. తుమ్మపాలలో నిర్వహించిన యోగాంధ్రలో ఆమె మాట్లాడారు. తొలుత సచివాలయ సిబ్బంది, గ్రామ నాయకులు, పీహెచ్‌సీ సిబ్బంది, అంగన్‌వాడీలు, విద్యార్థులతో కలిసి ఆసనాలు వేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలన్నారు. అనంతరం యోగా ప్రాధాన్యతను వివరిస్తూ గ్రామంలో ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ ప్రసాద్, యోగా గురువులు నరసింహారావు, జగన్, ఎంపీటీసీ చదరం నాగేశ్వరరావు, పీలా బుజ్జి, పంచాయతీ ఈవో ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



యోగాసనాలు వేస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్, అధికారులు

పరవాడ : ప్రతి రోజూ యోగా చేయడం ద్వారా మానసిక ప్రశాంతత పొందవచ్చని ఎంపీడీవో బి.రమేష్‌నాయుడు అన్నారు. ఇక్కడి మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో అన్ని శాఖల అధికారులతో కలిసి యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. తహసీల్దార్ ఎస్వీ అంబేద్కర్, ఈవోపీఆర్డీ కె.ధర్మారావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ జి.షణ్ముఖ, మండల పరిషత్ కార్యాలయ ఏవో రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

సబ్బవరం : యోగా సాధనతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఎంపీడీవో పి.పద్మజ అన్నారు. ఈనెల 21న జరగనున్న ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా పలు గ్రామాల్లో ఉద్యోగులు, సిబ్బంది, ప్రజలకు ఇస్తున్న శిక్షణ తరగతులను పరిశీలించిన అనంతరం ఇక్కడ మాట్లాడారు. ఈ కార్యక్రమాల్లో సర్పంచ్‌లు బోను దేముడమ్మ, పడాల వెంకటరమణ, బండారు మంగ, కార్యదర్శులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న హెడ్ కానిస్టేబుల్‌కు ఆర్థిక సాయం

అనకాపల్లి టౌన్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ ఎల్.గణేశ్వరరావు అనారోగ్యంతో బాధపడుతూ విశాఖలోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతుండడంతో అతనికి తోటి కానిస్టేబుళ్లు శనివారం ఆర్థిక సహాయం అందజేశారు. 1990 బ్యాచ్‌కు చెందిన కానిస్టేబుళ్లు శక్తి పోలీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఫండ్ నుంచి రూ.20వేల చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలోఅసోసియేషన్ అధ్యక్షుడు టి.అనిల్, పూర్ణ, ముబారక్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

'రక్తదానం గొప్పది'

అనకాపల్లి టౌన్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ రక్తదాన దినోత్సవం సందర్భంగా శనివారం పట్టణంలోని పలు చోట్ల రక్తదాన శిబిరాలను నిర్వహించారు. సత్యసాయి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో 20 మంది, ఎన్టీఆర్ వైద్యాలయంలో 18 మంది రక్తాన్ని దానం చేశారు. ఇందులో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు ఆళ్ల రామచంద్రరావు, తాడి శాంతికుమారి ఉన్నారు. ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద గల ఓ హోటల్‌లో సర్వేజన ఐక్యవేదిక వ్యవస్థాపకుడు కోరిబిల్లి పరమేష్ ఆధ్వర్యంలో యువతీ యువకులు రక్తదానం చేశారు. గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ దాతలను అభినందించారు. అలాగే ఎన్టీఆర్ వైద్యాలయం ఆధ్వర్యంలో రక్తదానంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. సూపరింటెండెంట్ డాక్టర్ కె.కృష్ణారావు మాట్లాడుతూ రక్తదానం చేయడం వల్ల ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారికి జీవం పోసినట్టు అవుతుందని వివరించారు. డీసీహెచ్ఎస్ డాక్టర్ శ్రీనివాస్, డీఎంహెచ్‌వో బాలాజీ, డాక్టర్ కనకదుర్గ, డాక్టర్ రమేష్, ల్యాబ్ టెక్నీషియన్లు పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న యువకులు

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండండి : ఎస్ఐ

కశింకోట, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : డిజిటల్ యుగంలో పెరుగుతున్న సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ కె.లక్ష్మణరావు సూచించారు. తాళ్ళపాలెంలోని నాగార్జున సిమెంటు కంపెనీలో నషా ముక్తి భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా శనివారం ఉద్యోగులకు, సిబ్బందికి ఏర్పాటైన అవగాహన సదస్సులో మాట్లాడారు. మత్తు పదార్థాల వాడడం వల్ల కలిగే అనర్థాలను తెలియజేశారు. ఆన్‌లైన్ ద్వారా ఓటీపీ మోసాలు ఏ విధంగా జరుగుతున్నాయో వివరించారు. తెలియని వారికి తమ బ్యాంకు ఖాతా వివరాలు, ఓటీపీలను షేర్ చేయవద్దని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ కొండయ్యతో పాటు పెద్ద సంఖ్యలో సంస్థ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

బంగారమ్మపాలెం పాల సొసైటీకి ఇద్దరు డైరెక్టర్ల ఎన్నిక

సబ్బవరం, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బంగారమ్మపాలెం పాల సొసైటీకి శనివారం జరిగిన ఎన్నికల్లో ఇద్దరు డైరెక్టర్లు ఎన్నికయ్యారు. టీడీపీ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీటీసీ దొడ్డి సూర్యప్రకాశరావు ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికల్లో దొడ్డి సూరిబాబు, దాడి వెంకట్‌లను సభ్యులు ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు దొడ్డి సోమేశ్వరరావు, రాజుకోటి, ముత్యాలనాయుడు, అడారి కోటి, కొణతాల కృష్ణ, కిల్లి సింహాచలం, సరిశెట్టి రమణ, రామప్పడు, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

స్కీం వర్కర్లకు 'తల్లికి వందనం' వర్తింపజేయాలి

అనకాపల్లి టౌన్/తుమ్మపాల, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : స్కీం వర్కర్లు, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ సిబ్బందికి తల్లికి వందనం పథకాన్ని వర్తింపజేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శంకరరావు కోరారు. శనివారం ఇక్కడ జరిగిన సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అందజేస్తున్న తల్లికి వందనం పథకాన్ని రాష్ట్రంలో అత్యంత తక్కువ వేతనాలతో పనిచేస్తున్న అంగన్‌వాడీ, ఆశ, వెలుగు తదితర స్కీం వర్కర్లతో పాటు వైద్య ఆరోగ్య శాఖలో, వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది కూడా అమలు చేస్తే వారికి కూడా ప్రయోజనంగా ఉంటుందన్నారు. ఈ అంశంపై ప్రభుత్వం వెంటనే స్పందించాల్సిందిగా కోరారు. ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ, కోశాధికారి వీవీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. ఇదిలావుంటే, ఇదే అంశంపై ఇక్కడి సీపీఐ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజాన దొరబాబు మాట్లాడారు. అంగన్‌వాడీలు, హాస్టల్ వర్కర్లకు తల్లికి వందనం పథకాన్ని వర్తింప చేయాలన్నారు. సమావేశంలో యూనియన్ల ప్రతినిధులు కె.త్రినాథ్, సత్యనారాయణ, ఈశ్వరరావు, పోతురాజు తదితరులు పాల్గొన్నారు.

'గుర్తింపు లేని కళాశాలల్లో పిల్లలను చేర్చవద్దు'

సబ్బవరం, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ గుర్తింపు లేని జూనియర్ కళాశాలలను అడ్డుకోవాలని ప్రైవేటు జూనియర్ కళాశాలల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కె.జనార్దనరావు, రాష్ట్ర కమిటీ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యుడు కె.నాగేశ్వరరావు, స్టేట్ వైస్ ప్రెసిడెంట్ ఎ.శేషగిరిరావు కోరారు. శనివారం ఇక్కడ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కొంత మంది ఎటువంటి గుర్తింపు లేకుండా జూనియర్ కళాశాలలు ఏర్పాటు చేసి విద్యార్థులను మోసం చేస్తున్నారని మండిపడ్డారు. అటువంటి కళాశాలలకు ప్రభుత్వం నుంచి ఎటువంటి పథకాలు రావని తల్లిదండ్రులు గుర్తించాలని సూచించారు. గుర్తింపు లేని కళాశాలలపై జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్‌కు, ఇంటర్మీడియట్ జిల్లా అధికారిణి సుజాతకు వినతి పత్రాలు అందజేసినట్టు చెప్పారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆర్.కృష్ణమోహన్, సభ్యులు భీశెట్టి ప్రసాద్, టి.మాణిక్యాలరావు తదితరులు పాల్గొన్నారు.































కొత్తపల్లి జలపాతాన్ని అభివృద్ధి చేస్తాం

» ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో అభిషేక్ గౌడ


జలపాతం వద్ద ఇన్‌చార్జి పీవో అభిషేక్ గౌడ

జి.మాడుగుల, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : కొత్తపల్లి జలపాతాన్ని మరింత అభివృద్ధి చేస్తామని పాడేరు జాయింట్ కలెక్టర్, ఇన్‌చార్జి ఐటీడీఏ పీవో అభిషేక్ గౌడ అన్నారు. మండలంలో శనివారం ఆయన కొత్తపల్లి జలపాతంను సందర్శించారు. ఆవరణలో చేపట్టిన సుందరీకరణ పనులను పరిశీలించారు. జలపాతం ముఖద్వారం ఏర్పాటు చేస్తామని ఈ సందర్భంగా పీవో హామీ ఇచ్చారు. జలపాతంలో సందర్శించే పర్యాటకులకు ప్రమాద సూచనలు చేయాలని ఏకోటూరిజం సభ్యులకు సూచించారు.

కొయ్యూరు సీడీపీవోగా దేవమణి


బాధ్యతలు స్వీకరించిన దేవమణి

కొయ్యూరు, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): కొయ్యూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవోగా ఎల్. దేవమణి శనివారం బాధ్యతలు స్వీకరించారు. రాజవొమ్మంగి ప్రాజెక్టు సీడీపీవోగా పనిచేస్తూ ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రాజెక్టు పరిధి అన్ని అంగన్‌వాడీ కేంద్రాల పనితీరును మరింత మెరుగుపరుస్తానన్నారు. కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న సేవలు లబ్ధిదారులకు సక్రమంగా అందించేలా చర్యలు తీసుకుంటానని తెలిపారు.

గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌గా నర్సింహమూర్తి


ప్రిన్సిపాల్ నర్సింహమూర్తి

కొయ్యూరు, జూన్ 14(ఆంధ్రజ్యోతి): స్థానిక గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌గా ఎస్. నర్సింహమూర్తి శుక్రవారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. తుమ్మలవలస గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌గా పనిచేస్తూ బదిలీపై ఆయన కొయ్యూరు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు మెరుగైన విద్య, నాణ్యమైన మెనూ అందించేలా కృషి చేస్తానన్నారు. ప్రిన్సిపాల్‌కు సిబ్బంది ఘనంగా స్వాగతపలికారు. పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు.

షరతులు లేకుండా తల్లికి వందనం అమలు చేయాలి: ఎస్ఎఫ్ఐ

పాడేరురూరల్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): తల్లికి వందనం పథకాన్ని ఎటువంటి షరతులు లేకుండా అమలు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా జిల్లా అధ్యక్షుడు కార్తీక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 2024- 25 లో పెండింగ్‌లో ఉన్న తల్లికి వందనం బకాయిలను వెంటనే విడుదల చేయాలన్నారు. ప్రతీ విద్యార్థికి రూ. 15 వేల చొప్పున తల్లికి వందనం నిధులు ఇస్తామని హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం ఇప్పుడు రూ. 13 వేలు చొప్పున చెల్లించి చేతులు దులుపుకోవడం విచారకమన్నారు. గత ప్రభుత్వం తరహాలోనే అనేక ఆంక్షలు విధించి వేలాది మంది అర్హులకు అన్యాయం చేయడం సరికాదన్నారు. ఇకనైనా ప్రభుత్వం తీరుమార్చుకొని ప్రతీ విద్యార్థికి రూ. 15 వేలు చొప్పున ఎటువంటి ఆంక్షలు లేకుండా చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు పి.చిన్నారావు, జగదీష్, శ్రీను, నితిన్, చరణ్, దిలీప్, రవి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు


ప్రమాద స్థలంలో గాయపడిన త్రిమూర్తులు

గూడెంకొత్తవీధి, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవరాపల్లి-లక్కవరపుపేట మార్గంలో ద్విచక్రవాహనం అదుపుతప్పి పడిపోవడంతో ఓ వ్యక్తికి తీవ్రగాయాలయ్యా యి. స్థానికుల కథనం ప్రకారం.. శనివారం సాయంత్రం ఏలూరు జిల్లా గణపవరానికి చెందిన త్రిమూర్తులు చింతపల్లి నుంచి లక్కవరపుపేట వెళతున్నాడు. వర్షం కురుస్తుండడం, ఎదురుగా కుక్కలు అడ్డుపడడంతో బైక్ అదుపుతప్పి అతను పడిపోయాడు. తీవ్ర గాయాలైన త్రిమూర్తులును 108లో చింతపల్లి ఏరియా ఆస్పత్రికి తరలించారు. వైద్యులు ప్రాథమిక చికిత్స అందించి నర్సీపట్నం తరలించారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం


దారకొండ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

సీలేరు, జూన్ 14 , (ఆంధ్రజ్యోతి) : జీకేవీధి మండలం ధారకొండ కాలనీలో సీతారాముల ఆలయ ద్వితీయ వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెల్లవారుజామున స్వామి వారికి అభిషేకాలు, ప్రత్యేక పూజా కార్యక్రమాల ను నిర్వహించారు. టీటీడీ శ్రీవాణి ట్రస్టు నుంచి విడుదలైన రూ. 10 లక్షల నిధులతో సమరసతా సేవా పౌండేషన్ ఆధ్వర్యంలో నిర్మాణం పూర్తి చేసుకుని 2023లో ఆలయాన్ని సమరసత సేవా పౌండేషన్ కార్యకర్తలు ప్రారంభించారు. అప్పటినుంచి ఏటా ఆలయ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నారు. శనివారం మధ్యాహ్నం భారీ అన్న సమారాధన తోపాటు ప్రత్యేక భజన కార్యక్రమాలను ఏర్పాటుచేసినట్టు ఆలయ కమిటీ సభ్యుడు, సమరసత సేవా పౌండేషన్ మండల కన్వీనర్ కొర్రా రాము తెలిపారు.


జి.మాడుగుల: రచ్చపల్లి పాఠశాలలో యోగా సాధనలో స్థానికులు


డుంబ్రిగుడ బాలికల పాఠశాల మైదానంలో ఆసనాలువేస్తున్న అధికారులు

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

జి.మాడుగుల, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని టీడీపీ మండల ఉపాధ్యక్షుడు పాటి భీంబాబు అన్నారు. శనివారం సింగర్భ పంచాయతీ రచ్చపల్లి ప్రభుత్వ పాఠశాల ఆవరణలో యోగాసనాలు వేశారు. కాగా మండలంలోని పలు చోట్ల యోగాంధ్ర కార్యక్రమాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కె.లక్ష్మణరావు, కల్యాణం, సచివాలయ సిబ్బంది కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

కొయ్యూరు: క్రమం తప్పకుండా యోగా సాధన చేయాలని ఎంపీడీవో జీడీవి ప్రసాదరావు సూచించారు. శనివారం యోగాంధ్ర కార్యక్రమం అమలులో భాగంగా మండలంలో గల అన్ని గ్రామ సచివాలయాలలో సామూహిక యోగాసన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఎంపీడీవో కొండ గోకిరి సచివాలయంలో పాల్గొని గ్రామస్థులతో కలిసి ఆసనాలు వేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మునిలినాయుడు సచివాలయ సిబ్బంది అదిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

డుంబ్రిగుడ: యోగాంధ్ర -2025 మాసోత్సవాల్లో భాగంగా స్థానిక ఎంపీడీవో ప్రేమ్ సాగర్, ఇన్‌చార్జి తహసీల్దార్ ముజీబ్ అధ్వర్యంలో స్థానిక బాలికల ఆశ్రమ పాఠశాల మైదానంలో శనివారం యోగా సాధన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యోగా సాధనతో మానసిక, శరీరకంగా ఆరోగ్యం చేకూరుతుందన్నారు. రోగ నిరోధక శక్తి పెరుగుతుందన్నారు.కార్యక్రమంలో ఆయా శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి ఘన సన్మానం


బదిలీ ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న కర్లాపొదర్ గ్రామస్థులు

ముంచంగిపుట్టు, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని లక్ష్మీపురం పంచాయతీ కర్లాపొదర్ పాఠశాలలో గల ఆరేళ్లుగా పనిచేస్తూ బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయుడు పి.లైకోన్‌ను సర్పంచ్ కె.త్రినాథ్‌తో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు శనివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ విద్యార్థుల అభ్యున్నతికి లైకోన్ ఎనలేని కృషి చేశారని, ఈ ఏడాది ఈ పాఠశాల నుంచి నలుగురు విద్యార్థులు ఏకలవ్య, ఆరుగురు గురుకుల ప్రవేశ పరీక్షల్లో సీట్లు సాధించారని అన్నారు. ఇటువంటి ఉపాధ్యాయుడు బదిలీపై వెళ్లిపోవడం బాధగా ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విద్యా కమిటీ చైర్మన్ గోపాల్, విద్యావాలంటీర్ సర్సమ్మ, గ్రామస్థులు పాల్గొన్నారు.

గిరిజన మంత్రి దృష్టికి పాడేరు సమస్యలు

పాడేరురూరల్, జూన్ 14(ఆంధ్రజ్యోతి): పాడేరు నియోజకవర్గ పరిధిలో ఉన్న సమస్యలు పరిష్కారానికి చర్యలు చేపట్టాలని రాష్ట్ర స్త్రీ శిశు, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణిని కోరినట్టు తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహణ కార్యదర్శి కోడా వెంకట సురేశ్ కుమార్ తెలిపారు. శనివారం సాలూరులో మంత్రిని ఆమె నివాస గృహంలో మర్యాద పూర్వకంగా కలిసి సమస్యలపై చర్చించామన్నారు. మంత్రిని కలిసిన వారిలో కొయ్యూరు ఎంపీటీసీ మాజీ సభ్యుడు వై.వరహాలబాబు,సురేంద్ర పాల్గొన్నారు.

ఆర్అండ్‌బీ స్థలాల్లో కట్టడాలు తొలగింపు

గూడెంకొత్తవీధి, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఆర్అండ్‌బీ స్థలాల్లో నిర్మించిన అక్రమ కట్టడాల స్థానిక వర్తకులు స్వచ్ఛందంగా తొలగిస్తున్నారు. రెండు రోజుల క్రితం స్థానిక రెవెన్యూ అధికారులు నోటీసులు అందజేశారు. ఈ నేపథ్యంలో శనివారం బస్‌స్టాండ్‌లో రహదారికి ఇరువైపులా నిర్మించుకున్న అక్రమ కట్టడాలను స్థానికులు తొలగించుకునే పనులు ప్రారంభించారు.

ఘనంగా ప్రపంచ రక్తదాన దినోత్సవం


కార్ల్ లాండ్ స్టినార్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సొసైటీ సభ్యులు

పాడేరురూరల్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎంవీఎస్ లోకేశ్వరరావు ప్రారంభించారు. దాతలు స్వయంగా వచ్చి 10 యూనిట్‌ల రక్తాన్ని దానం చేశారు. ముందుగా సొసైటీ ప్రతినిధులు కార్ల్ లాండ్ స్టినార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సొసైటీ వైస్ చైర్మన్ ఎస్.గంగరాజు ప్రపంచ రక్తదాతల దినోత్సవం ప్రాధాన్యం వివరించారు. ఆస్ట్రేలియా దేశానికి చెందిన కార్ల్ లాండ్ స్టినార్ 1901లో మొట్టమొదటి సారిగా రక్తాన్ని వర్గీకరించి నోబుల్ విజేతగా నిలిచారన్నారు. జూన్ 14న ఆయన జయంతిని పురస్కరించుకుని ఏటా ప్రపంచ రక్తదాత దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ఇప్పటికే 17సార్లు రక్తదానం చేసిన ఓ.సుమన్, 27 సార్లు రక్తదానం చేసిన సంతోష్‌లకు ఈ సందర్భంగా ప్రశంసాపత్రాలు, మెమోంటోలు అందజేశారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొర్రా నాగరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి జి. గౌరీశంకరరావు, కోశాధికారి పి.సూర్యారావు, డాక్టర్ రాఘవేంద్ర, సభ్యులు వి.జయలక్ష్మి, టి.ప్రసాద్‌నాయుడు, రవి, సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

'తల్లికి వందనం'లో కోత విధించ వద్దు: సీపీఎం

పాడేరురూరల్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): నిబంధనల పేరుతో తల్లికి వందనం పథకంలో కోతలు విధించ వద్దని సీపీఐ జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స అన్నారు. కూటమి నాయకులు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఈ పథకంలో నిబంధనలు సడలించి అర్హులైన విద్యార్థులు అందరికి అందించాలని డిమాండ్ చేశారు. అడ్డగోలు నిబంధనలతో రాష్ట్రంలో దాదాపు 9 లక్షల కుటుంబాలకు అన్యాయం జరిగే అవకాశం కనిపిస్తోందని ఆయన విచారం వ్యక్తంచేశారు. ఆదాయ పరిమితిని సడలించి గ్రామాల్లో ఏడాదికి రూ. 2.5 లక్షలు, పట్టణాల్లో రూ. 3 లక్షల లోపు ఆదాయం ఉన్న కుటుంబాలన్నింటికీ పథకం వర్తింపచేయాలన్నారు. వివిధ శాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల పిల్లలకు ఈ పథకాన్ని వర్తింపచేయాలని కోరారు.

100 అడుగుల మేర రోడ్ల విస్తరణ జరపాలి

» పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు


పాడేరులో రోడ్డు విస్తరణ పనులను చేపట్టాలని ఆందోళనకు దిగిన ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు తదతరులు

పాడేరురూరల్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా సుప్రీం కోర్టు ఆదేశాల మే రకు 100 అడుగుల మేర ప్రధాన రోడ్ల విస్తరణ చేపట్టాలని స్థానిక ఎమ్మెల్యే ఎం.విశ్వేశ్వరరాజు డిమాండ్ చేశారు. రోడ్డు విస్తరణ పనుల్లో అధికారుల తీరును నిరసిస్తూ శనివారం ఆయన పట్టణంలోని రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అల్లూరి జిల్లా 5వ షెడ్యూల్ ప్రాంతంలోని ప్రధాన కేంద్రాల్లో రోడ్డు విస్తరణ చేపట్టేందుకు, ప్రభుత్వ స్థలాల ఆక్రమణలను తొలగింపు పనులు చేపడుతున్నట్టు కలెక్టర్ తెలిపారన్నారు. గత నెల 31వ తేదీ శనివారం పాడేరు పట్టణంలోని పాత బస్టాండ్ ప్రాంతంలో రెవెన్యూ, ఆర్అండ్‌బీ అధికారులతో తూతూ మం త్రంగా 10 అడుగుల మేర ఆక్రమణలను తొలగించి వదిలేశారని ఆయన ఆరోపించారు. అనంతరం వారు ఈ నెల 7వ తేదీ శనివారం బక్రీద్ అని, 14వ తేదీ శనివారం 2వ శనివారం సెలవు అని ఆక్రమణలను తొలగించకుండా హైకోర్టు ఆదేశాలను నీరుకారుస్తున్నారన్నారు. ఈ స్థితిలో ఆందోళన చేపటాల్సి వచ్చిందన్నారు. జిల్లా కేంద్రంతో పాటు జిల్లాలోని ప్రధాన కేంద్రాల్లో రోడ్డుకు ఇరువైపులా 100 అడుగుల రోడ్డు విస్తరణ పనులు కచ్చితంగా చేపట్టాలని డిమాండ్ చేశారు. లేకుంటే పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ మండల పార్టీ అధ్యక్షుడు సీదరి రాంబాబు, జిల్లా మహిళా అధ్యక్షురాలు పార్వతమ్మ, ఎంపీటీసీ సభ్యుడు లకే రామకృష్ణ పాత్రుడు, కించూరు, కాడెలి సర్పంచ్‌లు వి.రాంబాబు, వి.బసవన్నదొర, మాజీ సర్పంచ్‌లు ఎం.కన్నాపాత్రుడు, ఎస్.సర్యనారాయణ, వందేమాతరం శ్రీనన్న తదితరులు పాల్గొన్నారు.

వాహనాల రికార్డులు ఉండాలి: ఎస్ఐ

జి.మాడుగుల, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : వాహనాల రికార్డులు తప్పని సరిగా కలిగి ఉండాలని స్థానిక ఎస్ఐ షణ్ముఖరావు సూచించారు. మండల కేంద్రంలో శనివారం వాహన తనిఖీలు చేపట్టారు. ఈసందర్భంగా వాహన దారులతో మాట్లాడుతూ, హెల్మెట్ ధరించాలని, మైనర్లకు వాహనాలు ఇవ్వరాదని చెప్పారు. రికార్డులు లేని వాహనా దారులపై కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ హెచ్చరించారు.

'బీజేపీ బలోపేతానికి సమష్టి కృషి'


మాట్లాడుతున్న శాంతకుమారి

ముంచంగిపుట్టు, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ బలోపేతానికి సమష్టి కృషి అవసరమని ఆ పార్టీ జిల్లా అధ్యక్షురాలు మఠం శాంతకుమారి అన్నారు. మండల కేంద్రంలో శనివారం ఆమె ముఖ్య నేతలు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చే స్తున్న సంక్షేమ పథకాలు గ్రామస్థాయిలో ప్రజలకు వివరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు సుబ్బారావు, నేతలు మత్స్యరాజు, సత్యవతి, గోపాల్, నాగభూషణ్, లక్ష్మణ్, నారాయణ, క్రిరిబాబు పాల్గొన్నారు.

'తల్లికివందనంపై అవాస్తవాలు సహించం'

అనంతగిరి, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): తల్లికి వందనం పథకంపై తప్పుడు ప్రచారాలు చేస్తే ఉరుకోమని టీడీపీ మండల అధ్యక్షుడు సోవేరి సుబ్బారావు హెచ్చరించారు. మండల కేంద్రంలోని శనివారం ఆ పార్టీ నాయకులు సమావేశయ్యారు.. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడారు.. ఇచ్చిన హామీలను నేరవేర్చడంలోని టీడీపీ పార్టీ ముందు ఉం టుందన్నారు. కొంతమంది వైసీపీ నాయకులు ఈ పథకం అమలుపై అవాస్తవాలు ప్రచారాలు చేయడం తగదన్నారు. తల్లులు ఎంతసంతోషంగా ఉన్నారో గ్రామాలకు వెళ్లి చూస్తే తెలుస్తోందన్నారు. ఈ కార్యక్రమంలోని టీడీపీ నాయకులు బాబీ, శంకరరావు, భీమన్న, గురువులు, రమేశ్, బుద్ధు, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి

» బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఉమామహేశ్వరరావు

చింతపల్లి, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లాలని బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కురుసా ఉమామహేశ్వరరావు అన్నారు. శనివారం స్థానిక మార్కెట్ యార్డులో నరేంద్ర మోదీ అధికారంలోకి వచ్చి 11ఏళ్లు పూర్తయిన సందర్భంగా ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. తొలుత మార్కెట్ యార్డులో బీజేపీ నాయకులు మొక్కలు నాటారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం వెనుకబడిన వర్గాలు, గిరిజనులు, పీవీటీజీలు సంక్షేమం, అభివృద్ధికి పెద్ద పీటవేసిందన్నారు. రహదారులు నిర్మించినట్టు చెప్పారు. జల్‌జీవన్ మిషన్ ద్వారా ప్రతి గ్రామంలో తాగు నీటి పథకాలు ఏర్పాటు చేశారన్నారు. రాష్ట్ర గిరిజన మోర్చా కార్యవర్గ సభ్యుడు బోనంగి బాలయ్యపడాల్, కార్యవర్గ సభ్యులు కదుళ్ల శ్రీను, పాడేరు మార్కెట్ కమిటీ చైర్మన్ మంగతల్లి, నాయకులు శ్రీను, సోమేశ్ పాల్గొన్నారు.

లారీ ఢీకొని రెండు గేదెలు మృతి

కొయ్యూరు, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాట్రగెడ్డ సమీపంలో శనివారం వద్ద జాతీయ రహదారి నిర్మాణాలకు వినియోగిస్తున్న లారీ ఢీకొనడంతో సుమారు రూ. 2 లక్షలు విలువ చేసే రెండు పాడి గేదెలు మృతి చెందాయి. నడింపాలెంనకు చెందిన వెలుసూరి రామారావు చెందిన గేదెలు మేపునకు వెళ్లాయి. ఈ క్రమంలో రోడ్డు దాటుతుండగా ప్రమాదం జరిగింది. రహదారి నిర్మాణ పనులకు వినియోగిస్తున్న లారీ డ్రైవర్ నిర్లక్ష్యంగా వ్యవహరించడంతోనే ఈ ప్రమాదం చోటుచేసుకుందని ఆరోపిస్తూ పరిసర గ్రామాల జనాలతోపాటు బాధితుడు రహదారిపై ఆందోళన చేపట్టారు. గేదెలు నష్టపోయిన రైతుకు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

నీట్‌లో మెరిశారు

... 1వ పేజీ తరువాయి

డి.జాహ్నవి 358, జామి గిరిజ 425, ఎం.జయదీప్ 672వ ర్యాంకు, జి.లక్ష్మీచరణ్ 875వ ర్యాంకు సాధించారు. వివిధ కేటగిరీల్లో చూస్తే 402, 905, 1582, 1742, 1782, 2190, 2742, 2956 ర్యాంకులు లభించాయి. నగరంలో శ్రీ చైతన్య, నారాయణ, శ్రీవిశ్వ, అసెంట్ విద్యార్థులు మంచి ర్యాంకులు సాధించారు. ఓపెన్ కేటగిరీలో 1000లోపు ర్యాంకర్లకు ఎయిమ్స్, ఇతర ప్రముఖ వైద్య కళాశాలల్లో సీట్లు లభించనున్నాయి.

శ్రమదానంతో రోడ్డుకు మరమ్మతులు


రోడ్డుపై గోతులు పూడ్చుతున్న పాతపాడు గ్రామస్థులు

పెదబయలు, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుంతుర్ల పంచాయతీపరిధి పలు గ్రామాలకు సరైన రోడ్డు సదుపాయం లేకపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. కిండలం, బొడ్డాపుట్టు, కందులగుంట, పాతపాడు గ్రామాలకు కలుపుకున్న ఉన్న ఒకే గ్రావెల్ రోడ్డు కూడా వర్షాలకు కోతకు లోనై కనీసం ద్విచక్రవాహనం వెళ్లలేని దుస్థితికి చేరింది. దీంతో పాతపాడు గ్రామస్థులు సమష్టిగా శనివారం గోతులతో ఉన్న రోడ్డును మట్టితో తాత్కాలికంగా పూడ్చి బాగు చేసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన పాంగి రాంబాబు, చిన్నారావు, కామేష్, జీఎస్‌యూ నాయకుడు బాబుజీ మాట్లాడుతూ నాలుగు గ్రామాలకు ప్రధాన మార్గం అయినా ఈ రోడ్డు సమస్యను పరిష్కరించాలని స్పందన, మీకోసం కార్యక్రమాలలో ఎన్ని వినతులు అందజేసినా ఏ ఒక్క అధికారీ స్పందించటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో తామే కోతకు గురైన రోడ్డును చదును చేసుకుంటున్నట్టు చెప్పారు. వర్షం పడితే మళ్లీ యథాతథమవుతుందని, అందువల్ల ఇకనైనా అధికారులు స్పందించి పూర్తి స్థాయిలో రోడ్డు అభివృద్ధి చేయాలని కోరారు.

'అర్హులందరికీ తల్లికి వందనం అమలు ఘనత కూటమిదే'


మాట్లాడుతున్న టీడీపీ అరకులోయ మండల అధ్యక్షుడు లకోయ్ మహదేవ్

అరకులోయ, జూన్14 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వానికి భిన్నంగా ఒక ఇంట్లో చదువుకున్న పిల్లలందరికీ తల్లికివందనం పథకం అమలు చేసిన ఘనత కూటమి ప్రభుత్వానికి దక్కుతుందని టీడీపీ మండల అధ్యక్షుడు లకోయి మహదేవ్, పెదలబుడు సర్పంచ్ దాసుబాబు అన్నారు. శనివారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన సూపర్‌సిక్స్ హమీల అమలుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కట్టుబడి పనిచేస్తున్నారని తెలిపారు. మండలంలో సుమారు 12, 445 మంది పిల్లలకు తల్లికివందనం పథకం మంజూరైందన్నారు. కొంతమంది తల్లిదండ్రుల ఆధార్ కార్డులు అను సంధానం కాక వారి ఖాతాల్లో తల్లివందనం జమకాలేదన్నారు. అటువంటి విద్యార్థుల తల్లిదండ్రులు సాంకేతిక లోపాలను మండల విద్యాశాఖ సరిచేసే పనిలో ఉన్నారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, విద్యాశాఖా మంత్రి నారా లోకేశ్‌లు పేద కుటుంబాల విద్యార్థుల విద్యా ప్రగతికి ఎంతగానో కృషి చేస్తున్నారన్నారు.

శాకాహారంతో ఎంతో మేలు


ర్యాలీ చేపడుతున్న భీమసింగి ఆశ్రమ భక్తులు

జి.మాడుగుల, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : శాఖాహారంతో అనేక విధాలుగా మేలు చేకూర్చుతుందని పాకలపాటి గురుదేవుల భీమసింగి ఆశ్రమ నిర్వాహకులు పి.దేవి, పి.రజితలు అన్నారు. ఈ మేరకు శనివారం వారి ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, హింసను వదిలి మంచిని ఆరాధించాలని సూచించారు. జీవులను బాధించకూడదని పేర్కొన్నారు. ఆసూయ, ద్వేషాలకు బదులుగా ప్రేమ, సహకారాలు పెరగాలంటే శాంతి స్థాపన జరగాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో భక్తులు ఎం.త్రిమూర్తులు, బంగారమ్మ, గోవిందరావు, సింహాచలంతో పాటు 11 మండలాల పాకలపాటి గురుదేవుల భక్తులు పాల్గొన్నారు.

నాన్నకు ప్రేమతో...

... 1వ పేజీ తరువాయి

ఇవ్వడంతో పాటు వారి త్యాగాలను గుర్తించాలి.

ఇలా చేయండి..

ప్రతిరోజూ ఎంతో కొంత సమయం తండ్రితో గడిపేందుకు యత్నించాలి. దూ రంగా ఉంటే వారితో రోజుకు ఒకసారైనా ఫోన్‌లో మాట్లాడాలి. ఆరోగ్యం గురించి వాకబు చేయాలి. హెల్త్ బీమా వంటివి తీసుకుని వారి ఆరోగ్యానికి రక్షణ కవచాన్ని ఏర్పాటుచేయాలి. ఆర్థిక ఇబ్బందులు లేకుండా చూసుకోవాలి. చివరి దశలో కంటికి రెప్పలా చూసుకుంటూ ముందుకుసాగాలి.

అన్నదాత ఆనందం

... 1వ పేజీ తరువాయి


పూర్తయిన గిడుతూరు కాలువ పనులు

ఉపాధి హామీ పథకం ద్వారా సాగునీటి కాలువల్లో పూడికల తొలగింపు, అభివృద్ధికి చర్యలు చేపట్టింది. మండలంలో సుమారు 75 చిన్న, పెద్ద, రిజర్వాయర్ సాగునీటి కాలువలను అభివృద్ధి చేస్తున్నట్టు మండల ఏపీవో కాశీ తెలిపారు. మామిడిపాలెం రిజర్వాయర్ కింద ఉన్న సుమారు 400 ఎకరాలకు సాగునీరు అందించే సాగునీటి కాలువ పనులు గత 20 రోజులుగా చేస్తున్నారు. ఈ ఏడాది రిజర్వాయర్ నుంచి నీరు వరి సాగుకు అందుతుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అయితే గత ప్రభుత్వం ఈ కాలువను ఐదేళ్లుగా పట్టించుకోకపోవడంతో రైతులు వరిసాగును వదిలేసి సరుగుడు వేశారు. అలాగే మాకవరపాలెం మెరక కాలువ ఐదేళ్లుగా తుప్పలతో ఉండడంతో ఈ కాలువ కింద ఉన్న సుమారు 200 మంది సాగురైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఇప్పుడు ఈ కాలువ పనులు కూడా చేపట్టడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మల్లవరం నుంచి గిడుతూరు గ్రామాల్లో ఉన్న 300 ఎకరాలకు సాగునీరు అందించే సాగునీటి కాలువలో తుప్పలు, పూడికలు తొలగించి సాగునీరు వచ్చేలా అభివృద్ధి చేశారు. మిగతా కాలువల అభివృద్ధి పనులు జోరుగా సాగుతున్నాయి. ఖరీఫ్ నాటికి ఈ పనులు పూర్తయితే ఈ ఏడాది సాగునీటికి ఇబ్బందులు ఉండవని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

నిబంధనలు పాటించకే ప్రమాదం

...1వ పేజీ తరువాయి

పూర్తిగా యాజమాన్యమే తీసుకోవాలన్నారు. ప్రమాదకరమైన ఉత్పత్తుల తయారీ నైపుణ్యం కలిగిన వారి పర్యవేక్షణలోనే జరగాలన్నారు. భద్రతా ప్రమాణాలు పాటించేందుకు నిరంతరం విజిలెన్స్ విభాగం పనిచేయాలన్నారు. ఈ సమావేశంలో చీఫ్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ ప్రసాదరావు, ఫ్యాక్టరీస్ జాయింట్ చీఫ్ ఇన్‌స్పెక్టర్ శివశంకరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సీఎం రాక రేపు

... 1వ పేజీ తరువాయి

కళాశాల మైదానానికి చేరుకుని యోగా దినోత్సవ ఏర్పాట్లు పరిశీలించి, మధ్యాహ్నం 12.05 గంటలకు నోవాటెల్ హోటల్‌కు వెళతారు. 12.15 నుంచి 1.30 గంటల వరకు యోగా దినోత్సవంపై అధికారులతో సమీక్షిస్తారు. మధ్యాహ్నం 2.30 గంటలకు నోవాటెల్ హోటల్‌లో బయలుదేరి 2.50 గంటలకు పీఎం పాలెంలోని వైజాగ్ కన్వెన్షన్ సెంటర్‌కు వెళ్లి పార్టీ కార్యకర్తల సమావేశంలో పాల్గొంటారు. అనంతరం సాయంత్రం ఐదు గంటలకు బయలుదేరి ఎయిర్‌పోర్టుకు చేరుకుని 5.35 గంటలకు ప్రత్యేక విమానంలో విజయవాడ వెళతారు.

పోస్టుమార్టానికి చోడవరంలో ప్రత్యేక కేంద్రం

» రెండు నియోజకవర్గాల ప్రజలకు తీరనున్న సమస్య



చోడవరం శివారున తామర చెరువు సమీపంలో సిద్ధమైన పోస్టుమార్టం కేంద్రం

చోడవరం, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంత ప్రజలకు పోస్టుమార్టం కష్టాలు తీరినట్టే. ఇందుకోసం చోడవరం కమ్యూనిటీ ఆసుపత్రి పరిధిలో ప్రత్యేక కేంద్రం అందుబాటులోకి వచ్చింది. దీంతో చోడవరం, మాడుగుల నియోజకవర్గాల ప్రజలకు జాగరం సమస్యకు చెక్ పడుతుంది.

చోడవరం కమ్యూనిటీ ఆసుపత్రిలో రూ.34 లక్షలతో పోస్టుమార్టం సెంటరు నిర్మాణం ఎప్పుడో పూర్తయినప్పటికీ, దాన్ని నెల రోజుల క్రితం అధికారులు ఆసుపత్రికి అప్పగించారు. ఈ సెంటరులో శవాల పోస్టుమార్టంకు అవసరమైన సామగ్రిని స్థానిక కమ్యూనిటీ ఆసుపత్రి అధికారులు సిద్ధం చేశారు. అలాగే పోస్టుమార్టం సెంటరుకు అవసరమైన విద్యుత్ కనెక్షన్ కూడా ఇవ్వడంతో సెంటరు నిర్వహణకు మార్గం సుగమమైంది.

చోడవరం, మాడుగుల నియోజకవర్గాల పరిధిలో ఎక్కడైనా ప్రమాదాలు జరిగి ఎవరైనా మృతి చెందినా, ఒకవేళ ఆత్మహత్య చేసుకున్నా మృతదేహాలను ఐదేళ్ల క్రితం వరకూ స్థానికంగా ఉన్న పోస్టుమార్టం సెంటరులో శవపరీక్ష నిర్వహించేవారు. తరువాత కాలంలో స్థానికంగా ఉన్న పోస్టుమార్టం సెంటరు శిథిలావస్థకు చేరడంతో, ఆ భవనంలో పోస్టుమార్టం చేయడానికి వైద్యులు సాహసించకపోయారు. దీంతో గత ఐదేళ్లుగా ఇక్కడ శవపరీక్షలు నిలిపివేశారు. దీంతో చోడవరం, మాడుగుల నియోజకవర్గాల పరిధిలోని మండలాల్లో పలు కేసులలో మృతిచెందిన వారి మృతదేహాలకు అనకాపల్లి ఎన్టీఆర్ ఆసుపత్రికి తీసుకువెళ్లి శవపరీక్ష చేయించి, తిరిగి తీసుకురావడానికి వారి కుటుంబ సభ్యులు పడరాని పాట్లు పడుతూ వచ్చారు.

రెండు నియోజకవర్గాల ప్రజాప్రతినిధులు చాలాకాలంగా పోస్టుమార్టం కష్టాలు తీర్చాలంటూ డిమాండ్ చేస్తూ వస్తున్నారు. ఎట్టకేలకు చోడవరంలో పోస్టుమార్టం సెంటరు నిర్మాణం పూర్తయి అందుబాటులోకి వచ్చింది. దీంతో అనకాపల్లి వెళ్లనవసరం లేకుండానే స్థానికంగా శవపరీక్ష నిర్వహించేందుకు అవకాశం ఏర్పడింది.

సెంటరు సిద్ధంగా ఉంది

-డాక్టర్ వినయ్‌కుమార్, కమ్యూనిటీ ఆసుపత్రి, చోడవరం

కమ్యూనిటీ ఆసుపత్రి పరిధిలో పోస్టుమార్టం సెంటరు అందుబాటులోకి వచ్చింది. ఈ సెంటరులో ఇపుడు శవ పరీక్షలు నిర్వహించడానికి సిద్ధంగానే ఉన్నాం. సెంటరులో అవసరమైన సామగ్రి కూడా అమర్చాం. పోస్టుమార్టం సేవలు ఇంక అందుబాటులోకి వచ్చినట్టే.

గంజాయి జోలికి వెళ్తే జైలు శిక్ష తప్పదు

» నర్సీపట్నం రూరల్ సీఐ ఎల్.రేవతమ్మ



పల్లావూరులో ర్యాలీ చేస్తున్న సీఐ రేవతమ్మ, ఎస్ఐలు తారకేశ్వరరావు, రామారావు

కృష్ణాదేవిపేట, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): గంజాయి క్రయవిక్రయాలు, తాగడం వంటి చర్యలకు పాల్పడితే కేసులు నమోదు చేసి జైలుకు తరలించడం తప్పదని నర్సీపట్నం రూరల్ సీఐ ఎల్.రేవతమ్మ హెచ్చరించారు. గొలుగొండ మండలంలోని సిహెచ్.నాగాపురం పంచాయతీ పల్లావూరు గ్రామంలో శనివారం సాయంత్రం మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక ప్రజలతో ఏర్పాటు చేసిన సదస్సులో సీఐ మాట్లాడుతూ గంజాయి రవాణాలో పట్టుబడి వారు జైలుపాలై తమ బంగారు జీవితాలు నాశనం చేసుకుంటున్నారని చెప్పారు. అలాగే ఈ చర్యల వల్ల కుటుంబాలు చిన్నాభిన్నమవుతున్నాయని ఆమె వివరించారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. గంజాయి కేసులు ఉన్న నిందితులపై పీడీ యాక్ట్ పెట్టి, వారి ఆస్తులు జప్తు చేయడం జరుగుతుందని సీఐ హెచ్చరించారు. అలాగే మహిళా, ఇతర చట్టాలను ప్రజలకు వివరించారు. గంజాయి, సారా, ఇతర మత్తు పదార్థాలు నిర్మూలనకు ప్రజలు తగిన సమాచారం అందించి తమకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కృష్ణాదేవిపేట, గొలుగొండ ఎస్ఐలు వై.తారకేశ్వరరావు, పి.రామారావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా రక్తదాతల దినోత్సవం

రక్తదాన శిబిరాలు విజయవంతం





చోడవరంలో రక్తదాతలకు ప్రశంసాపత్రాలు అందిస్తున్న నిర్వాహకులు... నర్సీపట్నంలో యువకుల రక్తదానం

చోడవరం, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రేమ సమాజం ఆవరణలో శనివారం ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని నిర్వహించారు. రాక్‌ఫ్రెండ్స్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. సామాజిక సేవా కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొని రక్తదానం చేశారు. స్థానిక టీడీపీ యువ నాయకుడు సకురు కోటేశ్వరరావు 13వ సారి రక్తదానం చేసి అందరికీ ఆదర్శంగా నిలిచారు. ఈ శిబిరంలో పాల్గొని రక్తదానం చేసిన అందిరికీ నిర్వాహకులు ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో రాక్ ఫ్రెండ్స్ సభ్యులు నరేంద్ర, షణ్ముఖ, నాయుడు, చక్రి, మధు, మూర్కిత, సాయి తదితరులు పాల్గొన్నారు.

నర్సీపట్నంలో...

నర్సీపట్నం అర్బన్: ఏరియా హాస్పటల్‌లో శనివారం రక్తదాణ శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 22 మంది నుంచి రక్తసేకరణ చేశారు. సందర్భంగా ఆస్పత్రి పరిపాలనాధికారి సుధాశారద మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు, గర్భిణుల ప్రసవ సమయాల్లో ప్రాణాలను కాపాడేందుకు ఈ రక్తం ఉపయోగపడుతుందన్నారు. అనంతరం రక్తదాణంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బ్లడ్ బ్యాంకు మెడికల్ ఆఫీసర్ అపర్ణ, సమిద స్వచ్ఛంద సంస్థ సభ్యుడు పాల్గొన్నారు.

భారీ వర్షం.. జనం ఉపశమనం





చీడికాడ మండలంలోని మండలంలోని మంచాల, కె.కోటపాడు రోడ్డుపై కురుస్తున్న వాన

కె.కోటపాడు/చీడికాడ, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంతో పాటు పరిసర ప్రాంతాల్లో శనివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతో సుమారు గంట సేపు వాన పడింది. దీంతో ఒక్కసారిగా వాతావరణం చల్లబడిపోయింది. ఇటీవల కాస్తున్న మండు ఎండలతో అల్లాడిపోతున్న ప్రజానీకానికి ఈ వర్షం ఎంతో ఉపశమనం కల్పించింది. కాగా ఈ వర్షం కూరగాయల పంటలకు ఊపిరి పోసిందని రైతులు ఆనందం వ్యక్తం చేశారు. ఇదిలా ఉంటే వర్షం కారణంగా వాహనదారులు అవస్థలు పడ్డారు. అలాగే చీడికాడ మండలంలో శనివారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి భానుడి ప్రతాపానికి అతలాకుతలమైన ప్రజలు, మధ్యాహ్నం కురిసిన వర్షానికి వాతావరణం చల్లబడిపోవడంతో ఊరట చెందారు.

వరుణ్ మోటార్స్ బ్రాంచి మేనేజర్, క్యాషియర్ అరెస్టు



వి.కొండారావు... ఎస్.రవికృష్ణ

గాజువాక, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): వరుణ్ మోటార్స్ సంస్థలో పని చేస్తూ సంస్థకు చెందిన పాత ద్విచక్ర వాహనాల విక్రయాల్లో అక్రమ లావాదేవీలకు పాల్పడిన చోడవరం బ్రాంచి మేనేజర్ సేనాపతి రవికృష్ణ, క్యాషియర్ విస్సారపు కొండారావులను శనివారం గాజువాక పోలీసులు అరెస్టు చేశారు. సీఐ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రవికృష్ణ చోడవరం బ్రాంచి మేనేజర్‌గా పనిచేసినప్పుడు 2020 నుంచి 2025 మధ్య కాలంలో సుమారు 400 పాత ద్విచక్ర వాహనాలకు సంబంధించి డెలివరీ రశీదులను ఫోర్జరీ చేసి విక్రయించి అక్రమ లావాదేవీలకు పాల్పడినట్టు పోలీసుల విచారణలో వెల్లడించాడు. ఇందులో కొండారావు కూడా కీలకంగా వ్యవహరించినట్టు తేలింది. కాగా ఉమ్మడి విశాఖ జిల్లా వ్యాప్తంగా ఉన్న వరుణ్ బజాజ్ బ్రాంచిలలో ఆర్థిక మోసాలు జరిగినట్టు వరుణ్ సంస్థ ప్రతినిధులు గతంలో గాజువాక పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు కేసు నమోదు చేసి అప్పట్లో కొంత మందిని అరెస్టు చేయగా, తాజాగా పరారీలో ఉన్న ఇద్దరు నిందితులను గాజువాక ప్రాంతంలో సీఐ పార్థసారథి అదుపులోకి తీసుకుని అరెస్టు చేశారు.

దళితులపై దాడులను ఖండించాలి

దేవరాపల్లి, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో దళితులపై జరుగుతున్న దాడులను అందరూ ఖండించాలని అంబేడ్కర్ ఆశయ సాధన సంఘం పిలుపునిచ్చింది. రైవాడ అతిథి గృహ ఆవరణలో శనివారం జరిగిన కార్యకర్తల సమావేశంలో సంఘ ప్రతినిధి కె.అప్పారావు మాట్లాడుతూ దళిత మహిళలపై దాడులు సరికాదని పేర్కొన్నారు. సంఘ సభ్యులు కె.సాయి సుందరరావు, పి.నాగభూషణ్, మాలిబాబు, పి.అప్పారావు, రాజు పాల్గొన్నారు.

గంజాయితో ఇద్దరి అరెస్టు

అనకాపల్లి టౌన్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): తమిళనాడుకు గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్టు పట్టణ సీఐ టీవీ విజయ్‌కుమార్ తెలిపారు. శనివారం పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తమిళనాడు రాష్ట్రం మధురై మండలం ఉసిలంపట్టి గ్రామానికి చెందిన జయవీరన్ కారుతి వీరదేవర్ డబ్బు సంపాదించాలనే ఆశతో తన స్నేహితుడు జి.మాడుగుల మండలం కోడాపల్లి గ్రామంలోని పీర్ రామన్ ప్రభాహర్ వద్దకు వచ్చి పది కిలోల గంజాయి కొనుగోలు చేశాడు. ప్రభాహర్ మధురైకు చెందిన వీరదేవర్‌ను ద్విచక్ర వాహనంపై అనకాపల్లి రైల్వే స్టేషన్‌లో దింపేందుకు శుక్రవారం మధ్యాహ్నం విశాఖ ఏజెన్సీ నుంచి బయలుదేరాడు. గూడ్స్‌షెడ్ వద్ద ఎస్ఐ, సిబ్బంది వాహనాలు తనిఖీ చేస్తుండగా ఇద్దరు బైక్, బ్యాగ్ వదిలేసి పారిపోయేందుకు ప్రయత్నించారు. ఎస్ఐ, సిబ్బంది వారిని అదుపులోకి తీసుకున్నారు. బ్యాగ్‌ను తనిఖీ చేయగా రూ.50 వేల విలువ చేసే గంజాయి ఉందని సీఐ తెలిపారు. గంజాయితో పాటు రెండు సెల్‌ఫోన్లు, రూ.2250 నగదు, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. వారిద్దరిపైన కేసు నమోదు చేసి శనివారం కోర్టుకు తరలించామని సీఐ చెప్పారు. ఈ సమావేశంలో ఎస్ఐలు డి.ఈశ్వరరావు, అల్లు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

వినాయక ఆలయంలో ప్రత్యేక పూజలు



వినాయక ఆలయంలో పూజలు చేస్తున్న అర్చకులు భక్తులు

రావికమతం, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని టి.అర్జాపురం బాలవరసిద్ధి వినాయకుని ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. లోక కల్యాణం కోరుతూ ఆలయ అర్చకులు గుంటూరు లక్ష్మణశర్మ, రామారావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో పలు గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

బీఎన్ రోడ్డు అభివృద్ధి చేయాలని నిరసన

రావికమతం, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల ప్రాణాలు హరిస్తున్న నర్సీపట్నం-భీమునిపట్నం రోడ్డును వెంటనే అభివృద్ధి చేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.గోవిందరావు డిమాండ్ చేశారు. మండలంలోని కొత్తకోటలో శనివారం బీఎన్ రోడ్డు గొయ్యిల వద్ద మోకాళ్లపై నిల్చొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గోవిందరావు మాట్లాడుతూ పదేళ్లగా బీబీఎన్ రోడ్డు ధ్వంసమై చెరువును తలపించేలా ఉన్నా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గత వైసీపీ ప్రభుత్వం ఈ రోడ్డు అభివృద్ధికి అనుమతులు మంజూరు చేసినా నిధులు ఇవ్వలేదని, దీంతో కాంట్రాక్టర్ పనులు మధ్యలోనే పనులను ఆపేశారని చెప్పారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ రోడ్డునే ముందు అభివృద్ధి చేసి ఈ ప్రాంత ప్రజల ఋణం తీర్చుకుంటామన్న కూటమి నేతలు ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు గెమిలి వాసు, వలసయ్య, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.



యోగాసనాలు వేస్తున్న అధికారులు, సిబ్బంది

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

నర్సీపట్నం, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): యోగాతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని మునిసిపల్ కమిషనర్ సురేంద్ర చెప్పారు. మునిసిపాలిటీలో వివిధ శాఖల అధికారులు యోగాంధ్ర కార్యక్రమంలో శనివారం భాగమయ్యారు. స్థానిక నలంద పాఠశాలలో పోలీస్, అగ్నిమాపక శాఖలతో పాటు వివిధ శాఖల అధికారులు యోగసనాలు వేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఈ నెల 21న విశాఖపట్నంలో జరిగే యోగా డేలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

క్యాన్సర్‌పై అవగాహన సదస్సు

గొలుగొండ, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పుత్తడిగైరంపేట గ్రామంలో క్యాన్సర్‌పై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. హోమీబాబా హాస్పటల్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ప్రత్యేక వైద్యులు మేఘన, ప్రదీప్ మాట్లాడారు. క్యాన్సర్‌ను ముందస్తుగా గుర్తించి, తగిన మందులు వాడితే అధిగమించవచ్చునని చెప్పారు. నోరు, రొమ్ము, గర్భాశయ క్యాన్సర్ లక్షణాలు, నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వారు వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పత్తి రమణ, గొలుగొండ పీహెచ్‌సీ వైద్యులు కె.ప్రసాద్, హోమీబాబా సిబ్బంది పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల చేయూత

కృష్ణాదేవిపేట, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): తమతో పాటు చదువుకుని ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న ముగ్గురు స్నేహితులకు 1994-1995 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు చేయూతనిచ్చారు. పాతకృష్ణాదేవిపేటకు చెందిన కయ్యం శ్రీలక్ష్మి, ఏఎల్‌పురం గ్రామానికి చెందిన పైల అప్పలనాయుడు, అనపర్తికి చెందిన జి.రవిబాబులకు రూ.10 వేలు చొప్పున శనివారం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్నేహితులకు, వారి కుటుంబానికి తామంతా అండంగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు మాకిరెడ్డి శ్రీరామ్‌మూర్తి, అలివేణి, మంగ, రాణి, దేవుడమ్మ లవకుశ, పాలపర్తి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రామాలయ నిర్మాణానికి అందరూ సహకరించాలి

నాతవరం, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో రామాలయం నిర్మాణానికి అందరూ సహకరించాలని రాష్ట్ర పామాయిల్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ పైల పోతురాజు కోరారు. శనివారం మాజీ ఎంపీపీ పారుపల్లి కొండబాబు, గ్రామ పెద్దలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నాతవరంలో సీతారామాలయం శిథిలావస్థకు చేరిందని, నూతన ఆలయం నిర్మించడానికి పెద్దలు సహకరించాలని కోరారు. అలాగే నాతవరంలో జరిగిన కోటమ్మతల్లి పండుగకు ఇతర ప్రాంతాల్లో స్థిరపడిన వారు సాయం చేసి సొంతూరు అభిమానం చాటుకున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు శెట్టి శ్రీనివాసరావు, అంకంరెడ్డి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా కళలను బలోపేతం చేయాలి

కె.కోటపాడు, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ సంస్కృతికి ప్రత్యామ్నాయంగా ప్రజా కళలను బలోపేతం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆంధ్రప్రదేశ్ ప్రజా నాట్యమండలి జిల్లా కార్యదర్శి పొంతపల్లి రామారావు అన్నారు. శనివారం కె.కోటపాడులో పొంతపల్లిలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అనకాపల్లిలో ఈ నెల 25న ఆంధ్రప్రదేశ్ ప్రజా నాట్యమండలి జిల్లా ప్రథమ మహాసభ నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ సందర్భంగా గ్రామాల్లో ప్రజా నాట్యమండలి సభ్యులు తమ ఆట పాటల ద్వారా ప్రజలను చైతన్యపరుస్తున్నారు. కళాకారులు, యువకులు ఈ మహాసభల్లో పాల్గొనాలని కోరుతూ కరపత్రాలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి గొర్లె దేవుడిబాబు, రెడ్డి అప్పలనాయుడు, దమ్ము ముత్యాలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులతో రెండు ఆవులు మృతి



మృతి చెందిన ఆవులు

చీడికాడ, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): ఖండివరం గ్రామంలో వ్యాధితో బాధపడుతూ రెండు ఆవులు మృతి చెందాయి. జనపరెడ్డి కల్యాణం అనే రైతుకు చెందిన ఆవులను మేతకు తీసుకుని వెళ్లగా, మేత అనంతరం పాకకు చేరుకుని ఒక్కసారిగా కుప్ప కూలిపోయాయి. వెంటనే రెండు ఆవులు మృతి చెందాయని బాధిత రైతు వాపోయాడు. వీటి విలువ సుమారు రూ.2 లక్షలు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు కోరారు. బాధిత రైతును సీడీసీ చైర్మన్ సుంకర శ్రీనివాసరావు తదితరులు పరామర్శించారు.

వంతెన పూర్తిచేయాలని ఆందోళన



అసంపూర్తిగా నిలిచిపోయిన వంతెన వద్ద నిరసన తెలుపుతున్న గ్రామస్థులు

మాడుగుల రూరల్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అవురువాడ పంచాయతీ శివారు పెదగొర్రిగెడ్డ, కొండవీధి గ్రామాలకు సంబంధించి గొర్రిగెడ్డ వాగుపై అసంపూర్తి వంతెనను పూర్తి చేయాలని ఆయా గ్రామాల ప్రజలు శనివారం ఆందోళనకు దిగారు. వంతెన లేకపోవడంతో వర్షాకాలంలో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నామని వాపో యారు. వైసీపీ ప్రభుత్వం హయాంలో వంతెన నిర్మిస్తామని చెప్పి మధ్యలోనే ఆపేశారని, కూటమి ప్రభుత్వమైనా పూర్తిచేయాలని కోరారు. స్థానిక నేతలు చక్రవర్తి, ఎ.శ్రీను, వలసయ్య, రాజుబాబు, గంగన్నదొర పాల్గొన్నారు.



పీఎం, సీఎం, డిప్యూటీ సీఎం చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న దృశ్యం

‘తల్లికి వందనం’ అమలుతో ఆనందం

ఒకటి నుంచి ఇంటర్ విద్యార్థులందరికీ డబ్బులు పడడంపై హర్షం

పీఎం, సీఎం, డిప్యూటీ సీఎం చిత్రపటాలకు పాలాభిషేకం

మాడుగుల రూరల్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): తల్లికి వందనం పథకం అమలుతో లబ్ధిదారుల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. ఒకటి నుంచి ఇంటర్ వరకు చదువుతున్న ఒకే కుటుంబంలోని విద్యార్థులందరికీ పథకం డబ్బులు పడడంతో తల్లిదండ్రుల్లో హర్షం వ్యక్తమవుతోంది. ఇందులో భాగంగా గాదిరాయి గ్రామంలో శనివారం ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చిత్రపటాలకు లబ్ధిదారులు, గ్రామస్థులు పాలాభిషేకం చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన మాట తప్పకుండా తల్లికి వందనం పథకం ఇచ్చారని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పెంటకోట జగన్నాథరావు, మాజీ సర్పంచ్ అద్దిపల్లి జగ్గారావు, నాయకులు బాబ్జి, అప్పారావు, రాజు పాల్గొన్నారు.

బుచ్చెయ్యపేటలో...

బుచ్చెయ్యపేట: మండలంలోని వడ్డాది గ్రామంలో తల్లికి వందనం డబ్బులు ఖాతాల్లో పడడంతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ మేరకు సంబరాలు చేసుకుని సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. తల్లికి వందనం అందించినందుకు డిప్యూటీ సీఎం పవన్ కల్యాన్, మంత్రి లోకేశ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. టీడీపీ వడ్డాది అధ్యక్షుడు నరేశ్, గ్రామస్థులు పాల్గొన్నారు.

బిజినెస్ ప్లస్

మోతీలాల్ ఓస్వాల్ బీఎస్ఈ 1000 ఇండెక్స్ ఫండ్

మోతీలాల్ ఓస్వాల్ మ్యూచువల్ ఫండ్ (ఎంఓఎంఎఫ్).. బీఎస్ఈ 1000 ఇండెక్స్ ఫండ్‌ను తీసుకువచ్చింది. ఇది ఓపెన్ ఎండెడ్ ఫండ్. దీని బీఎస్ఈ 1000 టీఆర్ఈ బెంచ్‌మార్క్ ఇండెక్స్‌గా ఉండనుంది. ఈ ఇండెక్స్ ఫండ్‌లో లార్జ్, మిడ్, స్మాల్, మైక్రోక్యాప్ విభాగాలకు చెందిన కంపెనీలున్నాయి. ఈ ఫండ్ కనీస పెట్టుబడి రూ.500. సిప్ రూపంలో కూడా ఇన్వెస్ట్ చేయవచ్చు. ముగింపు తేదీ ఈ నెల 19.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

15వ తేదీ			
హైదరాబాద్	540	విజయవాడ	515
వరంగల్	542	గోదావరి	500
చిత్తూరు	613	విశాఖపట్నం	550
		దజను గుడ్లు రూ. 78	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	97	విజయవాడ	100
వరంగల్	97	గుంటూరు	103
కరీంనగర్	97	ఒంగోలు	103
మహబూబ్‌నగర్	97	చిత్తూరు	94
కర్నూలు	97	నెల్లూరు	99
విశాఖపట్నం	90	అనంతపురం	99
గోదావరి	100		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,01,680 ▲	93,200 ▲	1,20,000 ▲
విజయవాడ	1,00,300 ▲	97,500 ▲	1,10,000 ▲
విశాఖపట్నం	1,01,400 ▼	93,200 ▲	1,20,000 ▲
రాజమండ్రి	1,01,670 ▲	93,200 ▲	1,09,400 ▲
ప్రొద్దుటూరు	98,100 ▼	90,250 ▼	1,05,000 ▲
ముంబై	99,060 ▲	90,740 ▲	1,06,170 ▲

నేడు ఫాదర్స్ డే. ఈ సందర్భంగా మీ తండ్రికి ఏదైనా బహుమతి ఇవ్వాలనుకుంటున్నారా..? చిన్న పిల్లలిచ్చే చిరు కానుకైనా నాన్నకు కలిగే సంతోషం చెప్పలేనంత. టీనేజీలో ఉంటే.. డాడీ ఇచ్చే పాకెట్ మనీతో గిఫ్ట్ కొని ఆయన్ని సంబుర పెట్టవచ్చు. ఇప్పటికే ప్రయోజకులై, సంపాదిస్తుంటే మాత్రం కాస్త భిన్నంగా ఆలోచించండి. మీ జీవితానికి సుస్థిర బాట వేసిన నాన్న భవిష్యత్‌కు ఆర్థిక భరోసా కల్పించే కానుక అందించడం మేలు.



లవ్ యూ నాన్న

ఆరోగ్య బీమా

వయసుతో పాటు ఆరోగ్య సమస్యలూ పెరగడం సాధారణం. కానీ, ఈ రోజుల్లో వైద్యం చాలా ఖరీదైపోయింది. దేశంలో వైద్య ఖర్చులు ఏటా 14 శాతం చొప్పున పెరుగుతున్నాయని ఓ సర్వే వెల్లడించింది. ఈ ప్రత్యేక దినోత్సవం సందర్భంగా మీ నాన్న ఆరోగ్యానికి బీమాతో ధీమా కల్పించండి. మీ నాన్న పేరిట హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీ కొనుగోలు చేయడం మేలు. మీ తండ్రి గారికి ఇప్పటికే దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలుంటే వాటికీ బీమా కవరేజీ లభించేలా పాలసీ తీసుకోవడం ఉత్తమం. ఒకవేళ మీ తండ్రి వయసు 50-60 ఏళ్ల పైబడితే, క్యాన్సర్, గుండెపోటు వంటి తీవ్ర అనారోగ్యాల ఖర్చులకూ కవరేజీ కల్పించే క్రిటికల్ ఇల్‌నెల్ పాలసీని తీసుకోవడం మంచిది.

రిటైర్మెంట్ ప్లాన్

మీ నాన్నకు రిటైర్మెంట్ ప్లాన్ బహుమతిగా ఇవ్వండి. లేదా ఆయన పేరిట యూనిట్ లింక్డ్ పెన్షన్ ప్లాన్ (యూఎల్‌పీపీ)లో ఇన్వెస్ట్ చేయొచ్చు. సాధారణంగా ఈ పథకాలు ఈక్విటీలతో పాటు రుణపత్రాల్లోనూ పెట్టుబడులు పెడుతుంటాయి. కాబట్టి, దీర్ఘకాలంలో మంచి ప్రతిఫలాలు లభించే అవకాశం ఉంటుంది. ఈ పాలసీ గడువు ముగిశాక, పోగైన కార్పస్‌లో 60 శాతం వెనక్కి తీసుకొని, మిగతా సొమ్ముతో నెలవారీ పెన్షన్ లభించేలా ప్లాన్ చేయండి. తద్వారా మలి వయసులో మీ నాన్నకు ఆర్థిక స్వేచ్ఛ కల్పించండి. అంతేకాదు, మన సగటు ఆయుష్షు 80 ఏళ్లకు పెరిగింది. కాబట్టి, రిటైర్మెంట్ తర్వాత 20-30 ఏళ్ల వరకు మీ నాన్నకు ప్రతినెలా ఖర్చులకు సరిపడా సొమ్ము చేతికందేలా దీర్ఘకాలిక వ్యూహంతో పెట్టుబడులు పెట్టండి.

పొదుపు పథకాలు

మీ తండ్రి పేరిట కొంత సొమ్మును ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయవచ్చు. ఒకవేళ సీనియర్ సిటిజన్ అయితే, అధిక వడ్డీ చెల్లించే పొదుపు పథకాలు చాలా అందుబాటులో ఉన్నాయి. బ్యాంకులు, పోస్టల్ డిపార్ట్‌మెంట్ వీరి కోసం ప్రత్యేక పథకాలను ఆఫర్ చేస్తున్నాయి. లేదంటే, ఏదైనా మ్యూచువల్ ఫండ్ స్కీమ్‌లోనూ పెట్టుబడులు పెట్టవచ్చు. క్రమానుగత పెట్టుబడి పథకాలు (సిప్) కూడా మంచి ప్రత్యామ్నాయం.

షేర్లు, సెక్యూరిటీలు

భవిష్యత్‌లో మంచి ప్రతిఫలాలు అందించేందుకు అవకాశాలున్న కంపెనీల షేర్లను కానుకగా ఇవ్వండి. ప్రభుత్వ సెక్యూరిటీల్లోనూ పెట్టుబడులు పెట్టవచ్చు. కొంత రిస్క్ తీసుకోగలిగితే, మంచి రేటింగ్ కలిగిన కార్పొరేట్ బాండ్లలోనూ ఇన్వెస్ట్ చేయొచ్చు.

యాడ్ ఆన్ కార్డ్

మీ క్రెడిట్ కార్డుపై యాడ్ ఆన్ కార్డు తీసుకోగలిగే వెసులుబాటు ఉంటే.. దాన్ని మీ నాన్నకు గిఫ్ట్‌గా ఇవ్వవచ్చు. తద్వారా చిన్న మొత్తాల్లో ఖర్చుల కోసం వారు ఆ కార్డును ఉపయోగించుకునే వీలుంటుంది.

గూడ్స్ ట్రాన్స్‌పోర్ట్ ఏజెన్సీ నిర్వహిస్తున్నారా..!

ఇదీ GST



రాంబాబు గొండాల

దేశ ఆర్థికాభివృద్ధిలో రవాణా రంగం పాత్ర ఎంతో కీలకం. ముఖ్యంగా వస్తు రవాణా సేవలు (ట్రాన్స్‌పోర్ట్ సర్వీస్) సరిగా లేకుంటే ఏ ప్రాంతంలో కూడా పారిశ్రామికాభివృద్ధి, వ్యాపారాభివృద్ధి జరగదు. ఒక ఫ్యాక్టరీకి ముడి సరుకు కావాలన్నా, తయారైన వస్తువులు బయటకు పోవాలన్నా, ఒక వ్యాపారి సరుకు కొనుగోలు చేయాలన్నా, అమ్మాలన్నా లేదా ఒక రైతు పండించిన పంటను అమ్ముకోవాలన్నా రవాణా సౌకర్యం లేకుంటే ఏదీ జరగదు. ఇంత ముఖ్య పాత్ర పోషిస్తున్న 'గూడ్స్ ట్రాన్స్‌పోర్ట్'కు సంబంధించి జీఎస్‌టీ విధివిధానాలు, పన్ను రేటు వివరాలు మీ కోసం. ఇంతకు ముందు సర్వీస్ ట్యాక్స్‌లో కానీ ఇప్పుడు జీఎస్‌టీలో కానీ వస్తు రవాణాకు సంబంధించి 'గూడ్స్ ట్రాన్స్‌పోర్ట్ ఏజెన్సీ' అనే ఒక సర్వీస్ ప్రవేశపెట్టడం జరిగింది. దీనినే జీటీఏ అని అంటారు. జీఎస్‌టీలో గూడ్స్ ట్రాన్స్‌పోర్ట్ మీద విధించే పన్ను ఈ జీటీఏకు సంబంధించి ఉంటుంది. మరి జీటీఏ అంటే ఏమిటి? వస్తు రవాణా చేసే ప్రతి వాహనం జీటీఏ కిందకు వస్తుందా?

జీఎస్‌టీ పరిభాషలో చెప్పాలంటే రోడ్డు ద్వారా వస్తు రవాణా చేస్తూ కన్‌సైన్‌మెంట్ నోట్ లాంటివి ఇచ్చే వ్యక్తి లేదా సంస్థను గూడ్స్ ట్రాన్స్‌పోర్ట్ ఏజెన్సీ అంటారు. మరి కన్‌సైన్‌మెంట్ నోట్ అంటే ఏమిటి? దీనికి అటుఇటుగా నిర్వచించినప్పటికీ ట్రాన్స్‌పోర్ట్‌కు సంబంధించిన వ్యక్తి తన వాహనంలో రవాణా చేసే వస్తువులకు సంబంధించి ఇచ్చే రసీదు. ఇందులో వస్తువులు పంపే వ్యక్తి, స్వీకరించే వ్యక్తి, రవాణా అవుతున్న వస్తువుల వివరాలతో పాటుగా సరుకు ఎక్కడి నుంచి బయలుదేరుతుంది, ఎక్కడకు రవాణా అవుతుందనే వివరాలు ఇందులో ఉంటాయి. కన్‌సైన్‌మెంట్ నోట్‌కు ఎందుకు అంత ప్రాముఖ్యత ఉందంటే ఎప్పుడైతే ట్రాన్స్‌పోర్టర్ కన్‌సైన్‌మెంట్ నోట్ ఇస్తాడో.. ఆ వస్తువులకు సంబంధించిన పూర్తి బాధ్యత వస్తు విక్రయదారుని నుంచి ట్రాన్స్‌పోర్టర్‌కు బదిలీ అవుతుంది. ఆయా వస్తువులు గమ్యస్థానం చేరే వరకు వాటి సంరక్షణ బాధ్యత అతనిదే. కాబట్టి ఏ వాహనదారుడైతే కన్‌సైన్‌మెంట్ నోట్ ఇస్తాడో అతను మాత్రమే జీటీఏ కింద పరిగణించబడతాడు. అతను మాత్రమే జీఎస్‌టీ పరిధిలోకి వస్తాడు. అంటే రోడ్డు మీద ఉండే చిన్న వాహనాలు, ఆటో సర్వీస్‌లు జీటీఏ పరిధిలోకి రావు. ఎందుకంటే ఇవి సాధారణంగా ఎలాంటి కన్‌సైన్‌మెంట్ నోట్ ఇవ్వవు.

మరి జీటీఏ కిందకు వచ్చే వ్యక్తి ఎంత పన్ను కట్టాలి? జీటీఏకి సంబంధించి రెండు రకాల పన్ను శ్లాబులు ఉన్నాయి. ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటీసీ) వాడుకుంటే 12 శాతం లేకుంటే 5 శాతం చొప్పున పన్ను కట్టాల్సి ఉంటుంది.

అయితే జీటీఏ ఈ కింది కేటగిరిలోని వ్యక్తులకు సర్వీస్ అందజేస్తే సదరు సర్వీస్‌ను రివర్స్ చార్జ్ కింద పరిగణించి ఆయా సేవలు అందుకునే వ్యక్తులు 5 శాతం చొప్పున పన్ను కట్టాల్సి ఉంటుంది. అవేమిటంటే.. ఏదేనీ ఫ్యాక్టరీ, సొసైటీ, కో-ఆపరేటివ్ సొసైటీ, జీఎస్‌టీ కింద రిజిస్టర్ అయిన వ్యక్తులు, బాడీ కార్పొరేట్, పార్ట్‌నర్‌షిప్ ఫర్మ్, క్యాజువల్ ట్యాక్సబుల్ పర్సన్ మొదలైనవి. అంటే, ఎప్పుడైతే ఒక జీటీఏ పైన తెలిపిన కేటగిరీలోని వ్యక్తులకు లేదా సంస్థలకు సరుకు రవాణా చేస్తేంటే.. ఆయా వ్యక్తులు లేదా సంస్థలు రివర్స్ చార్జ్ మెకానిజం (ఆర్‌సీఎం) కింద 5 శాతం పన్ను చెల్లించాలి. ఇలాంటి సందర్భంలో జీటీఏకి ఐటీసీ పొందే అర్హత ఉండదు. అంటే వారు కొనే లారీల మీద లేదా ఇతర సర్వీసుల మీద ఐటీసీ పొందే అర్హత కోల్పోతారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని తనంతట తానే ట్యాక్స్ కడుతూ ఐటీసీ పొందే సౌలభ్యాన్ని ప్రభుత్వం కల్పించింది. కానీ పన్ను 12 శాతం చొప్పున కట్టాలి. అంటే ఒక జీటీఏ తనంత తానే ట్యాక్స్ కట్టాలంటే (ఫార్వర్డ్ ట్యాక్స్ మెకానిజం) కచ్చితంగా 12 శాతం చెల్లించాలి. ఒకసారి ఈ విధానాన్ని ఎంచుకుంటే ఆ ఆర్థిక సంవత్సరం మొత్తం అదే విధానంలో ఉండాలి.

అయితే 2022 జూలైలో దీనికి మళ్లీ సవరణ చేయటం జరిగింది. దీని ప్రకారం ఫార్వార్డ్ మెకానిజంలో రెండు రకాల ఆప్షన్స్ ఇవ్వటం జరిగింది. 5 శాతం, 12 శాతం అంటే జీటీఏ తనే ట్యాక్స్ కడుతూ ఐటీసీ పొందాలంటే 12 శాతం ఎంచుకోవాలి. ఒకవేళ 5 శాతం ఎంచుకుంటే ఐటీసికి అర్హత ఉండదు. ఇది ఏదీ కాకుండా సర్వీస్ పొందిన వ్యక్తి పన్ను కట్టాలంటే ఆర్‌సీఎం విధానాన్ని ఎంచుకోవాలి. అప్పుడు కూడా ఐటీసీ అర్హత ఉండదు. మరి ఏ విధానం ఎంచుకున్నాడో ఎలా తెలవాలంటే.. తదుపరి ఆర్థిక సంవత్సరానికి సంబంధించి తాను ఎంచుకునే విధానానికి సంబంధించి అనెగ్జర్-V ను మార్చి 15లోపు దాఖలు చేయాల్సి ఉంటుంది. అంటే 2025-26 ఆర్థిక సంవత్సరంలో తాను ఏ పన్ను విధానాన్ని ఎంచుకుంటున్నది 2025 మార్చి 15లోపు తెలియజేయాలి. ముఖ్యంగా గుర్తు పెట్టుకోవాల్సిన విషయం ఏమిటంటే ఒకసారి ఒక విధానాన్ని ఎంచుకుంటే ఆ ఆర్థిక సంవత్సరం మొత్తం అదే విధానంలో కొనసాగాలి.

గమనిక: కేవలం అవగాహన కల్పించటం కోసం మాత్రమే ఇందులో కొన్ని ముఖ్య విషయాలను ప్రస్తావించటం జరిగింది. పూర్తి వివరాలకు సంబంధిత చట్టాలను క్షుణ్ణంగా పరిశీలించాలి.



వ్యక్తిగత రుణం తీసుకుంటున్నారా!

ఈ నిబంధనలు తెలుసుకోండి..

ప్రస్తుత ప్రపంచంలో ఎక్కువ మంది అప్పుల అప్పారావులే. ఖర్చులు ఆదాయాన్ని మించిపోయినప్పుడు ఎవరైనా అప్పులు చేయక తప్పదు. ఆరోగ్య బీమా లేకుండా ఆరోగ్యం దెబ్బతిన్నప్పుడు, ఇంటి రిపేర్లు, లేదా ఇతర అత్యవసర ఖర్చుల కోసం అప్పులు చేయక తప్పదు. ఈ రోజుల్లో చేబదులు ఇచ్చే వాళ్లు తక్కువ. అప్పుడు వ్యక్తిగత రుణాలే గతి.

బ్యాంకులు, నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీల (ఎన్‌బీఎఫ్‌సీ) నుంచి వ్యక్తిగత (పర్సనల్) రుణాలు తీసుకునే వారి సంఖ్య రోజురోజుకీ పెరిగిపోతోంది. కొద్దిగా రిస్క్ ఉన్నా వడ్డీ రేటు కొద్దిగా ఎక్కువగా ఉండడంతో బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలు కూడా ఈ రుణాలు ఇచ్చేందుకు ఆసక్తి చూపిస్తున్నాయి. ప్రస్తుతం బ్యాంకు రుణాల్లో దాదాపు 36 శాతం ఈ రుణాలే. దీన్ని బట్టి బ్యాంకులు కూడా ఈ రుణాలపై ఎంత ఆసక్తితో ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. కాకపోతే కొన్ని అర్హతలకు లోబడి మాత్రమే బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలు ఈ రుణాలు ఇస్తాయి. ఆ అర్హతలు ఏమిటో తెలుసుకుందాం.

రుణ అర్హతలు: వ్యక్తిగత రుణాల మంజూరుకు ప్రతి బ్యాంకు, ఎన్‌బీఎఫ్‌సీ కొన్ని నిబంధనలు పాటిస్తుంది. ఈ అర్హతలు ఆయా సంస్థలను బట్టి వేరు వేరుగా ఉంటాయి. అయితే అన్ని సంస్థలు రుణం తీసుకునే వ్యక్తి కనీస ఆదాయం, క్రెడిట్ స్కోరు, వయసు, చేస్తున్న ఉద్యోగం, తీసుకునే రుణాన్ని ఎంత కాలంలో చెల్లిస్తాడు? అనే విషయాలను తప్పనిసరిగా చూస్తాయి. పై విషయాల ఆదారంగా వ్యక్తిగత రుణం తీసుకున్న వ్యకికి ఎంత రుణం మంజూరు చేయవచ్చు? ఆ రుణం తీసుకున్న వ్యక్తి ఆ రుణాన్ని సకాలంలో తిరిగి చెల్లించగలడా? లేదా? అనే అంశంపై బ్యాంకులు ఒక అవగాహనకు వస్తాయి. ప్రస్తుతం చాలా బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలు ఈ రుణాల మంజూరు ప్రక్రియను ఆన్‌లైన్ చేశాయి. ఆయా బ్యాంకుల వెబ్‌సైట్‌లోకి వెళ్లి మీ కేవైసీ వివరాలు, కావాల్సిన ఈఎంఐ ప్లాన్ ఎంటర్ చేస్తే వ్యక్తిగత రుణ మంజూరుకు మీకు అర్హత ఉన్నదీ, లేనిదీ బ్యాంకులు వీలైనంత త్వరగా తెలియజేస్తాయి. ఈ రుణాల కనీస వడ్డీ 10.5 శాతం నుంచి ప్రారంభమవుతుంది.

ప్రధాన అర్హతలు

- 21 నుంచి 50 సంవత్సరాల మధ్య వయస్కులై ఉండాలి
- కనీస క్రెడిట్ స్కోర్ 700 పైన ఉండాలి
- ఉంటున్న నగరాన్ని బట్టి కనీస నెలవారీ ఆదాయం
- ఎన్నాళ్ల నుంచి ఆయా సంస్థల్లో పని చేస్తున్నారు
- స్వయం ఉపాధా లేక ఉద్యోగమా?
- ఇతర రుణాల చెల్లింపు భారమేమైనా ఉందా లేదా అనే అంశం

తెలుసుకోవడం ఎలా?

వ్యక్తిగత రుణాలకు మనకు అర్హత ఉందా? లేదా? అనే విషయం తెలుసుకోవడం పెద్ద కష్టమేమీ కాదు. ఇందుకు ప్రస్తుతం ఆన్‌లైన్‌లో అనేక ఫ్రీ టూల్స్ ఉన్నాయి. ఆ వెబ్‌సైట్లలోకి లాగిన్ అయి మీ వయసు, ఆదాయం, ఉద్యోగం, ఇప్పటికే ఉన్న అప్పుల వంటి వివరాలు నమోదు చేస్తే చాలు. మీరు ఎంత వ్యక్తిగత రుణానికి అర్హులో వెంటనే తెలిసిపోతుంది.

స్పోర్ట్స్



ఒలింపిక్ చాంపియన్‌కు ఆర్య జోడీ షాక్

వరల్డ్‌కప్‌లో స్వర్ణం కైవసం

మ్యూనిచ్: ఒలింపిక్ చాంపియన్‌కు షాకిచ్చిన భారత షూటింగ్ జోడీ ఆర్య బోర్స్-అర్జున్ బబుతా స్వర్ణాన్ని కైవసం చేసుకొంది. ఐఎస్ఎస్ఎఫ్ వరల్డ్‌కప్‌లో శనివారం జరిగిన 10 మీ ఎయిర్ రైఫిల్ మిక్స్‌డ్ ఈవెంట్ స్వర్ణ పోరులో ఆర్య-అర్జున్ జంట 17-7తో చైనాకు చెందిన వరల్డ్ చాంపియన్ ద్వయం జీఫీ వాంగ్-లిహావో షెంగ్‌ను చిత్తు చేసింది. క్వాలిఫికేషన్ రౌండ్‌లో అర్జున్ (317.7 పాయింట్లు), ఆర్య (317.5)లు మొత్తం 635.2 పాయింట్లు సాధించి రెండో స్థానంలో నిలవగా.. షెంగ్-వాంగ్ జంట 635.9 పాయింట్లతో అగ్రస్థానాన్ని సొంతం చేసుకొన్నారు.

రెండు దశలలో రంజీట్రోఫీ

దేశవాళీ టోర్నీలో మార్పులు

న్యూఢిల్లీ: ఈసారి రంజీ ట్రోఫీ (2025-26) అక్టోబరు 15 నుంచి వచ్చే ఏడాది ఫిబ్రవరి 28 వరకు రెండు దశలలో జరగనుంది. ఈమేరకు శనివారం జరిగిన బీసీసీఐ అపెక్స్ కౌన్సిల్ సమావేశం నిర్ణయించింది. అలాగే ఈ సీజన్ రంజీట్రోఫీలో మార్పులు కూడా చోటు చేసుకోనున్నాయి. వచ్చే సీజన్‌నుంచి ప్లేట్‌గ్రూపు నుంచి ఎలీట్‌కు ఒక్కోజట్టు మాత్రమే పదోన్నతి, రెలిగేషన్ అవనున్నాయి. రంజీ తొలి దశ అక్టోబరు 15 నుంచి నవంబరు 19 వరకు, రెండో దశ జనవరి 22 నుంచి ఫిబ్రవరి ఒకటి వరకు నిర్వహిస్తారు. నాకౌట్ ఫిబ్రవరి 6 నుంచి 28 వరకు జరుగుతుంది. దులీప్ ట్రోఫీని ఆగస్టు 28 నుంచి సెప్టెంబరు 15 వరకు నిర్వహిస్తారు. ఇరానీ కప్ అక్టోబరు ఒకటి నుంచి 5 వరకు జరుగుతుంది. ముస్తాక్ అలీ టోర్నీలో సూపర్ లీగ్ విధానాన్ని ప్రవేశపెడుతున్నారు. అలాగే ప్లేట్ గ్రూప్‌నూ పునఃపవేశపెడుతున్నారు.

హైదరాబాద్, విశాఖలో కివీస్ మ్యాచ్‌లు!

వచ్చే ఏడాది జనవరిలో మూడు వన్డేలు, ఐదు టీ20లలో భారత్-న్యూజిలాండ్ జట్లు తలపడనున్నాయి. జనవరి 11 నుంచి 31 వరకు సిరీస్ జరగనుంది. ఈ సిరీస్‌లో భాగంగా జనవరి 11న జరిగే తొలి వన్డేకు హైదరాబాద్ ఆతిథ్యం ఇవ్వనున్నట్టు తెలిసింది. రెండో వన్డే రాజ్‌కోట్ (జనవరి 14), మూడో వన్డే ఇండోర్ (జనవరి 18), తొలి టీ 20 నాగ్‌పూర్ (జనవరి 21), రెండో టీ20 రాంచి (జనవరి 23), మూడో టీ20 గువాహటి (జనవరి 25), నాలుగో టీ 20 విశాఖపట్నం (జనవరి 28), ఐదో టీ20 తిరువనంతపురం (జనవరి 31)లో జరగనున్నట్టు సమాచారం.


ప్రణతికి కాంస్యం

ఆసియా జిమ్నాస్టిక్స్



న్యూఢిల్లీ: భారత్‌కు చెందిన ప్రణతి నాయక్ ఆసియా సీనియర్ మహిళల ఆర్టిస్టిక్ జిమ్నాస్టిక్స్ చాంపియన్‌షిప్ వాల్ట్ విభాగంలో కాంస్యం సాధించింది. దక్షిణకొరియాలోని జెచియాన్‌లో శనివారం జరిగిన ఫైనల్లో 30 ఏళ్ల ప్రణతి 13.466 పాయింట్లు స్కోరు చేసి మూడో స్థానం దక్కించుకుంది. యిహాన్ ఝూంగ్ (చైనా, 13.650) స్వర్ణం, థీ క్విన్ (వియత్నాం, 13.583) రజతం నెగ్గారు. భారత్‌కే చెందిన ప్రొతిష్ఠ సమంత (13.016) నాలుగో స్థానంలో నిలిచింది. ఈ ప్రదర్శనతో ఆసియా స్థాయి పోటీలలో 3 పతకాలు అందుకున్న భారత జిమ్నాస్ట్‌గా ప్రణతి రికార్డుకెక్కింది. దీంతో దీపా కర్మాకర్ (రెండు పతకాలు)ను అధిగమించింది. 2019, 2022 ఆసియా చాంపియన్‌షిప్స్‌లో ప్రణతి కాంస్యాలు నెగ్గింది.

ఢిల్లీ చెస్ విజేత అభిజిత్



న్యూఢిల్లీ: ఢిల్లీ ఓపెన్ చెస్ టైటిల్‌ను భారత జీఎం అభిజిత్ గుప్తా (8.5 పాయింట్లు) సొంతం చేసుకున్నాడు. 9వ రౌండ్‌లో మిహాయిల్ (బెలారస్)పై కీలక విజయం సాధించిన అభిజిత్.. ఇంటర్నేషనల్ మాస్టర్ ఆరోనిక్ ఘోష్‌తో చివరి రౌండ్‌ను డ్రా చేసుకున్నాడు. నికీ టెన్కో (బెలారస్) రెండో, భారత గ్రాండ్‌మాస్టర్ దీప్తాయన్ ఘోష్ మూడో స్థానంలో నిలిచారు.

'బన్నీ హాప్స్' క్యాచ్‌లు కుదరవు..

దుబాయ్: బౌండరీల దగ్గర పట్టే 'బన్నీ హాప్స్' క్యాచ్‌ల విషయంలో మెరిల్‌బోన్ క్రికెట్ క్లబ్ (ఎంసీసీ) కీలక నిర్ణయం తీసుకుంది. క్యాచ్ విషయంలో ఫీల్డర్ నియంత్రణ కోల్పోయే అవకాశం ఉంటే మైదానంలో ఉన్నప్పుడే బంతిని పైకి విసిరి.. లైన్ దాటి తిరిగి లోనికి వచ్చే అందుకోవాల్సి ఉంటుంది. అంటే బౌండరీ బయట బంతిని పలుమార్లు ఎగర వేయడం కుదరదు. ఈనెల నుంచే కొత్త రూల్ ఐసీసీ ప్లేయింగ్ కండిషన్‌లో భాగం కానుండగా.. వచ్చే ఏడాది అక్టోబరు నుంచి ఎంసీసీ రూల్ ఆఫ్ లాలో అధికారికంగా చేరుస్తారు. మరోవైపు వన్డేల్లో రెండు కొత్తబంతుల నిబంధనల్లో మార్పు, కంకషన్ సబ్‌స్టిట్యూట్ ప్రొటోకాల్‌ను ఐసీసీ ఆమోదించింది.

సఫారీలు సాధించారు

27 ఏళ్ల తర్వాత తొలి ఐసీసీ టైటిల్ సొంతం

వరల్డ్ టెస్టు చాంపియన్‌గా దక్షిణాఫ్రికా

ఫైనల్లో ఆసీస్‌పై ఘన విజయం

ఏళ్లు కాదు.. దశాబ్దాలపాటు ఎదురుచూసిన తరుణమిది. తమ శక్తి యుక్తులన్నీ ధారపోసి పోరాడినా ఐసీసీ టోర్నీల్లో నిరాశగా వెనుదిరగడమే చూసిన దక్షిణాఫ్రికా ఇప్పుడు సగర్వంగా 'గద' ఎత్తుకుంది. ఒత్తిడికి చిత్తయ్యే జట్టంటూ.. చోకర్స్‌గా ముద్ర వేసి క్రీడాలోకం పరిహసించినా.. క్రికెట్ పుట్టినిల్లుగా భావించే లార్డ్స్‌లోనే 'ఇదిగో ఇదీ మా సత్తా' అంటూ వరల్డ్ టెస్టు చాంపియన్స్ హోదాలో పోడియంపై నిలిచింది. బలమైన ప్రత్యర్థి ఆసీస్ బౌలర్ల ధాటికి తొలి ఇన్నింగ్స్‌లో విలవిల్లాడిన బ్యాటర్లు లక్ష్య ఛేదనలో మాత్రం తెగించి నిలబడ్డారు. శతక వీరుడు మార్క్రమ్‌తో పాటు చీలమండ గాయం ఇబ్బందిపెట్టినా గెలుపు కోసం కెప్టెన్ బవుమా క్రీజులో నిలిచిన తీరుకు వహ్వా.. అనాల్సిందే. దీంతో 27 ఏళ్ల తర్వాత ఐసీసీ టోర్నీల్లో సఫారీలు విజేతలయ్యారు.



ప్రైజ్‌మనీ

దక్షిణాఫ్రికాకు - రూ. 31.05 కోట్లు

ఆస్ట్రేలియాకు - రూ. 18.63 కోట్లు

సంక్షిప్త స్కోర్లు

ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్: 212; **దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్:** 138 ఆలౌట్; **ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్:** 207 ఆలౌట్ (స్టార్క్ 58 నాటౌట్, క్యారీ 43, లబుషేన్ 22; ఎన్‌గిడి 3/38, రబాడ 4/59); **దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్:** 282/5 (మార్క్రమ్ 136, బవుమా 66; బెడింగమ్ 21; స్టార్క్ 3/66).

2 లార్డ్స్ మైదానంలో రెండో అత్యధిక ఛేదన (282)ను సాధించిన జట్టుగా సౌతాఫ్రికా. 1984లో ఇంగ్లండ్‌పై 342 పరుగుల ఛేదనతో విండీస్ టాప్‌లో ఉంది.

3 డబ్ల్యూటీసీలో వరుసగా మూడో సీజన్‌లోనూ కొత్త విజేత రావడం విశేషం. గతంలో న్యూజిలాండ్, ఆస్ట్రేలియా చాంపియన్స్‌గా నిలిచాయి.

4 ఐసీసీ టోర్నమెంట్ ఫైనల్స్‌లో ఆసీస్ ఓడడం ఇది నాలుగోసారి.

దక్షిణాఫ్రికా ఆడిన ఐసీసీ ఫైనల్స్

టోర్నీ	ఏడాది	ప్రత్యర్థి
నాకౌట్ ట్రోఫీ	1998	విండీస్‌పై గెలుపు
మహిళల టీ20 వరల్డ్‌కప్	2023	ఆసీస్ చేతిలో ఓటమి
పురుషుల టీ20 వరల్డ్‌కప్	2024	భారత్ చేతిలో ఓటమి
మహిళల టీ20 వరల్డ్‌కప్	2024	కివీస్ చేతిలో ఓటమి
వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్	2025	ఆసీస్‌పై విజయం

లండన్: రెండేళ్ల పాటు అద్భుత విజయాలతో సాగిన దక్షిణాఫ్రికా ప్రయాణం.. ప్రతిష్ఠాత్మక వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకోవడంతో ముగిసింది. శనివారం డబ్ల్యూటీసీ ఫైనల్‌లో ఆస్ట్రేలియాను 5 వికెట్ల తేడాతో ఓడించిన బవుమా సేన ఐసీసీ టెస్టు గదను సగర్వంగా అందుకుంది. అలాగే ఈ జట్టుకిది వరుసగా ఎనిమిదో టెస్టు విజయం కాగా.. 1998లో నాకౌట్ ట్రోఫీ తర్వాత రెండో ఐసీసీ టోర్నీ విజయం కావడం విశేషం. అటు ఇప్పటికే పది ఐసీసీ టైటిళ్లను ఖాతాలో వేసుకున్న ఆసీస్ రెండోసారి డబ్ల్యూటీసీ టైటిల్‌పై ఆశలు పెట్టుకున్నా నిరాశే ఎదురైంది. 2010 (టీ20 వరల్డ్‌కప్) తర్వాత కంగారూలు ఓ ఐసీసీ టోర్నీ ఫైనల్లో ఓడడం ఇదే తొలిసారి. నాలుగో రోజు కేవలం విజయానికి 69 పరుగుల దూరంలో నిలిచిన సఫారీలు తమ రెండో ఇన్నింగ్స్‌లో 282/5 స్కోరు సాధించారు. మార్క్రమ్ (136), బవుమా (66) గెలుపులో కీలక పాత్ర పోషించారు. స్టార్క్‌కు మూడు వికెట్లు దక్కాయి. అంతకుముందు ఆసీస్ తొలి ఇన్నింగ్స్‌లో 212, సౌతాఫ్రికా 138 పరుగులు చేయగా.. రెండో ఇన్నింగ్స్‌లో 207 పరుగులు సాధించిన ఆసీస్ ప్రత్యర్థి ముందు 282 పరుగుల లక్ష్యాన్ని ఉంచింది. **ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా మార్క్రమ్** నిలిచాడు.

తొలి సెషన్‌లోనే..: నాలుగో రోజు 213/2 ఓవర్‌నైట్ స్కోరుతో రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన సౌతాఫ్రికా గెలుపునకు మరో 69 పరుగులే చేయాల్సివుంది. ఆసీస్ బౌలర్లు సఫారీలపై ఒత్తిడి పెంచేందుకు స్టంప్స్‌ను లక్ష్యంగా చేసుకుని బంతులు విసిరారు. వికెట్ల కోసం ఆసీస్ తమకున్న మూడు రివ్యూలను కూడా వాడేసుకుంది. కొత్త బంతిని సైతం తీసుకున్నా.. మొక్కవోని ఏకాగ్రతతో బ్యాటర్లు క్రీజులో నిలిచారు. తొలి సెషన్‌లో కేవలం మూడు బౌండరీలు మాత్రమే వచ్చాయి. అయితే మూడో ఓవర్‌లోనే కెప్టెన్ బవుమాను కమిన్స్ దెబ్బతీయడంతో మూడో వికెట్‌కు 147 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. కానీ మార్క్రమ్ వారికి అడ్డుగా నిలిచాడు. స్టబ్స్ (8)తో కలిసి నాలుగో వికెట్‌కు 24.. బెడింగమ్ (21 నాటౌట్)తో కలిసి ఐదో వికెట్‌కు 35 పరుగులు జోడించాడు. గెలుపునకు మరో 6 పరుగుల దూరంలో అతడి 6 గంటల 23 నిమిషాల సుదీర్ఘ పోరాటానికి పేసర్ హాజెల్‌వుడ్ తెరదించాడు. మార్క్రమ్‌కు ఇరు జట్ల ఆటగాళ్లతో పాటు లార్డ్స్ ప్రేక్షకులు లేచి నిలబడి చప్పట్లతో అభినందనలు తెలిపారు. చివరకు 84వ ఓవర్‌లో స్టార్క్ వైడ్ ఫుల్‌టాస్‌ను కవర్ పాయింట్ వైపు వెరెయిన్ (4 నాటౌట్) సింగిల్ తీయడంతో దక్షిణాఫ్రికా అంతులేని సంబరాల్లో మునిగింది.



మార్క్రమ్

సరికొత్త అధ్యాయం

ఎన్నాళ్ల నిరీక్షణ.. ఎన్నేళ్ల నిర్వేదన..! కీలక నాకౌట్ మ్యాచ్‌ల్లో ఓటములతో అభిమానుల కలలు కల్లలు కావడం.. జట్టు నైరాశ్యంలో మునిగిపోవడం. మొత్తంగా వెరసి 'అన్ లక్కీ' అనే ట్యాగ్‌ను సొంతం చేసుకొన్న జట్టు దక్షిణాఫ్రికా. చోకర్స్ (కీలక మ్యాచ్‌ల్లో ఒత్తిడికి చిత్తయ్యే జట్టు)గా ముద్ర వేసుకొన్న సఫారీలు ఇప్పుడు చాంపియన్లుగా నిలిచారు.

దిగ్గజాల వల్ల కానిది..: ఏబీ డివిల్లీర్స్, గ్రేమ్ స్మిత్, గ్యారీ కిర్‌స్టెన్, అలెన్ డొనాల్డ్, జాక్ కలిస్ లాంటి దిగ్గజ ఆటగాళ్లు జట్టు కోసం ఎంతో శ్రమించారు. వీరందరి కృషితో జట్టు మెరుగుపడినా.. ఐసీసీ ట్రోఫీ మాత్రం అందని ద్రాక్షే అయింది. ఎట్టకేలకు మార్క్రమ్, బవుమా అద్భుత పోరాటంతో సౌతాఫ్రికా క్రికెట్ చరిత్రలో సరికొత్త అధ్యాయాన్ని లిఖించారు.

ఓటములను దిగమింగుకొని..: నాకౌట్స్‌లో నిరాశ.. సఫారీలకు 1992 నుంచి వెంటాడుతోంది. ఆ వరల్డ్‌కప్‌లో ఇంగ్లండ్‌తో సెమీస్ మ్యాచ్‌లో వరుణుడి రూపంలో షాక్ తగిలింది. 1999 వరల్డ్‌కప్‌లో ఆస్ట్రేలియాతో సెమీస్ మ్యాచ్ టై కావడం అనేది ఎప్పటికీ గుండెల్లో ముల్లులాంటిదే. గతేడాది జూన్ 29న జరిగిన టీ20 ప్రపంచకప్ ఫైనల్లో భారత్ చేతిలో ఓడిన దక్షిణాఫ్రికా.. ఏడాది తిరిగే సరికి 'జూన్ 14'ను సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ రోజుగా మార్చుకొంది. కెరీర్ చివర్లో ఉన్న రబాడ.. ఫైనల్ మ్యాచ్‌లో కంగారూల పనిబట్టాడు. తొలి ఇన్నింగ్స్‌లో డకౌటైన మార్క్రమ్.. భారీ శతకంతో మ్యాచ్‌ను మలుపు తిప్పాడు. వీరిద్దరి పోరాట స్ఫూర్తితో సౌతాఫ్రికా అసాధ్యాన్ని సుసాధ్యం చేసింది.

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)